ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 115 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 31 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :115 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 31 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది

- కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడంపై హర్షం
- ప్రజల ఆకాంక్షల మేరకు అద్దంకికి రెవెన్యూ డివిజన్ మంజూరు చేసినట్టు వెల్లడి
- దుర్గగుడిలో విద్యుత్ అంతరాయంపైనా మంత్రి వివరణ
- జనవరి 6 లేదా 7 తేదీల్లో దేవాదాయ శాఖతో ప్రత్యేక సమన్వయ సమావేశం



**పెన్ పవర్ డెస్క్:**అద్దంకి, కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను మన్నిస్తూ, ఆ ప్రాంతాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషదాయకమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అశాస్త్రీయ జిల్లాల విభజనను సరిదిద్దుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ,

వివరాలు 2లో..



## శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్
- రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం డ్రెయిన్ పనులకు శంకుస్థాపన
- క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న డిప్యూటీ సీఎం



**పెన్ పవర్ డెస్క్:**కోనసీమ జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో మరో కీలక అడుగు పడింది. జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కోనసీమ జిల్లా కలెక్టర్, జల వనరుల శాఖ అధికారులు, ఇతర అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, కోనసీమలోని కొబ్బరి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. ప్రత్యేకంగా, రాజోలు పర్యటనలో 45 రోజుల్లో సమస్యను పూర్తి చేయాలని హామీ ఇచ్చినప్పటికీ, 35 రోజుల్లోపే ఈ డ్రెయిన్ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపించింది.డ్రెయిన్ ఆధునికీకరణ ద్వారా జిల్లా అభివృద్ధిలో కొత్త దశ ప్రారంభంకానుంది. శంకరగుప్తంలోని వర్షకాల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఇది దోహదపడనుంది.



## అమిత్ షా వ్యాఖ్యల పై మమతా బెనర్జీ ఫైర్

- బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయన్న అమిత్ షా
- పహల్గాం, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో ఉగ్రదాడులు ఎవరు చేశారో చెప్పాలన్న మమత
- బీజేపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**బెంగాల్ రాజకీయాలు మరోసారి హాట్ టాపిక్‌గా మారా యి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో

వివరాలు 2లో..



## మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్... గతంలో కంటే ప్రాణాంతకం!

- ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న 'కాండిడా ఆరిస్' ఫంగస్
- చికిత్స అందించినా 50 శాతానికి పైగా మరణాలు
- చర్మంపై ఎక్కువ కాలం ఉంటూ ఇతరులకు వ్యాప్తి
- సాధారణ ల్యాబ్ పరీక్షల్లో గుర్తించడం కష్టం

**పెన్ పవర్ డెస్క్:**భారతీయ పరిశోధకుల నేతృత్వంలో జరి గిన ఓ తాజా అధ్యయనం ఆరోగ్య రంగంలో ఆందోళ నకర విషయాలను వెల్లడించింది. డ్రగ్ రెసిస్టెంట్ (మందులకు లొంగని) ఫంగల్ జాతి 'కాండిడా ఆరిస్' ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని, ఇది గతంలో కంటే ప్రాణాంతకంగా మారుతోందని

వివరాలు 2లో..

## గ్రూప్-2 రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు... నియామకాలకు లైన్ క్లియర్

- ఏపీ గ్రూప్-2 అభ్యర్థులకు భారీ ఊరట
- గ్రూప్-2 రిజర్వేషన్లపై హైకోర్టు కీలక తీర్పు
- రోస్టర్ పాయింట్లపై దాఖలైన అన్ని పిటిషన్లను తోసిపుచ్చిన ధర్మాసనం
- లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు లభించిన భారీ ఊరట



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్-2 నియామకాల్లో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను సవాలు చేస్తూ దాఖలైన

వివరాలు 2లో..

## అనుకున్న దానికన్నా ముందుగానే దర్శనాలు ప్రారంభించాం

- శ్రీవారి ఆలయంలో ఘనంగా ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి వేడుకలు
- ధనుర్మాస కైంకర్యాల అనంతరం అర్ధరాత్రి దాటాక వైకుంఠ ద్వార దర్శనాలు షురూ
- వైకుంఠ ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్న తెలంగాణ సీఎం



**పెన్ పవర్ డెస్క్:**తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శనాలు అత్యంత

వివరాలు 2లో..

## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి... తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



- పుతిన్ నివాసంపై దాడి వార్తలు కలచివేసాయన్న మోదీ
- శాంతి చర్చలకు విఘాతం కలిగించే చర్యలు వద్దని హితవు
- 91 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసిందన్న రష్యా
- ట్రంప్ మధ్యవర్తిత్వంతో కొలిక్కి వస్తున్న శాంతి చర్చలు
- యుద్ధం ముగింపు దశకు చేరుకుందన్న అమెరికా అధ్యక్షుడు

**పెన్ పవర్ డెస్క్:**రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసం లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడుల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలే యుద్ధాన్ని ముగించి, శాంతిని స్థాపించడానికి సరైన మార్గమని స్పష్టం చేశారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న వార్తలు తనను కలచివేశాయని, ఇలాంటి సమయంలో

వివరాలు 2లో..

## ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్



- రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న విరూపాక్షి
- విరూపాక్షికి ఫోన్ చేసి పరామర్శించిన జగన్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ అధినేత

**పెన్ పవర్ డెస్క్:**కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని వైసీపీ అధినేత జగన్ సోమవారం నాడు పరామర్శించారు. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో విరూపాక్షి రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో, ఆయనకు జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం.. శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

- ఢిల్లీ గగనతల భద్రతపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు
- రూ. 5,181 కోట్ల అంచనాతో సుదర్శన చక్రం
- గగనతల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక దృష్టి



**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ-89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది.

వివరాలు 2లో..

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్



- దేశంలో 1.46 లక్షల కిలోమీటర్లకు చేరిన జాతీయ రహదారులు
- 2014తో పోలిస్తే ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణంలో భారీ వృద్ధి
- ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా ఉచిత వైద్య సాయం అమలు
- క్షతగాత్రులను ఆదుకునే వారికి రూ.25 వేల రివార్డు పెంపు

**పెన్ పవర్ డెస్క్:**గత 11 ఏళ్లలో భారతదేశం మౌలిక సదుపాయాల కల్పనలో, ముఖ్యంగా జాతీయ రహదారుల విస్తరణలో సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల పొడవు 1,46,560 కిలోమీటర్లకు చేరడంతో, అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారులు, 2025 నాటికి ఏకంగా 61 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# డేటా కేంద్రాలు.. జనజీవనం అస్తవ్యస్తం!

'కృత్రిమ మేధ' విప్లవం భూగోళాన్ని వేగంగా కమ్ముకుంటోంది. దాన్ని బలోపేతం చేసేందుకు సాగుతున్న గ్లోబల్ పరుగులో అగ్రభాగాన నిలిచేందుకు ఇండియా చేస్తున్న ప్రయత్నంలో భాగంగా, అందుకవసరమైన భారీ డేటా సెంటర్ల నిర్మాణం కోసం రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే నీటి కొరతలో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాల్లో డేటా సెంటర్లు నెలకొల్పుతున్నారు. దీనివల్ల దేశంలో డిజిటల్ బూమ్‌కు సమాంతరంగా నీటి కరవు తాండవిస్తుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ డిజిటల్ వికాసం జనజీవన వినాశనానికి దారితీస్తోంది. ఆసియాలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఇండియా అంతర్జాతీయ డేటా సెంటర్ల ఏర్పాటుకు కూడలిగా మారబోతోంది. ఆ క్రమంలో రాష్ట్ర పాలకులు, ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చట్టాలు, నిబంధనలు పాటించని అనేక పరిశ్రమలను (రోగ్ ఇండిస్ట్రీస్) ప్రజల పన్నుల సొమ్ముతో అనేక రాయితీలు కల్పించి ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా జీవనాన్ని, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని ఫణంగా పెట్టి కార్పొరేట్ కేంద్రిత ఆర్థిక, ద్రవ్య విధానాలను కేంద్రం దన్నుతో అమలు చేస్తుండడం రాష్ట్ర ప్రజలకు శాపంగా పరిణమించనుంది. కాలుష్య కారక, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను కలిగించే ఘన, ద్రవ, వాయు వ్యర్థాలను యథేచ్ఛగా వెదజల్లే ఫ్యాక్టరీలకు విచ్చలవిడిగా అనేక రుణాలు, సబ్సిడీలు, మౌలిక వసతుల కల్పనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడమనే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. వాతావరణ ప్రతికూల ప్రభావాలను కల్గించే, ప్రాథమికంగా పెద్దఎత్తున విద్యుత్‌ను, నీటిని వినియోగిస్తూ, వేడిని, ఈ-వ్యర్థాలను వెదజల్లుతూ స్థానిక వనరులు ధ్వంసం చేసే, కర్బన ఉద్గారాలను అరాచకంగా వెదజల్లే.. నీటి కరువు, తీవ్ర శీతోష్ణస్థితి మార్పులు, మానసిక, శారీరక రుగ్మతలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే.. అత్యంత ప్రమాదకరమైన ఈ కేంద్రాల నిర్మాణం క్షమించరాని దారుణం. 2030 నాటికి 6 గిగావాట్ సామర్థ్యంగల డేటా సెంటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 7 డేటా సెంటర్లు రాష్ట్రంలో నడుస్తున్న వాటికి తోడుగా, వైజాగ్ కేంద్రంగా గూగుల్, రిలయన్స్, సిఫీ కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున డేటా కేంద్రాలను నిర్మాణం చేపట్టనున్నాయి. అదే విధంగా విజయవాడ సమీపంలోని ఐ.టి పార్క్‌లో 60 మెగా వాట్ల సామర్థ్యంగల డేటా సెంటర్లను 'పై డేటా సెంటర్స్' అనే సంస్థ ఒక హబ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ డేటా సెంటర్ల నిర్మాణం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, ఆర్థికాభివృద్ధిని తీసుకొస్తామని పాలకులు గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు.

ఇండియాలో డేటా సెంటర్ మార్కెట్ విజృంభిస్తోంది. 130-153 డేటా సెంటర్లు దేశవ్యాప్తంగా 31 ప్రాంతాల్లో విస్తరించడమే కాకుండా, రాబోయే కొన్ని సంవత్సరాల్లో ఆ సంఖ్య రెట్టింపు కావొచ్చుననే అంచనాలు జోరుగా సాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఎన్.టి.టి గ్లోబల్ సెంటర్లు, టెలీ మీడియా గ్లోబల్, ఐరన్ మౌంటైన్, ఈక్వినాక్స్ అనే గ్లోబల్ డేటా సెంటర్ల ఆపరేటర్లు, కంట్రోల్ ఎస్, పై డేటా సెంటర్లు, బి.ఎస్.ఎన్.ఎల్ (నెక్స్ జెనరేషన్ ఇన్‌ఫినైట్), వెబ్ వర్క్స్, ఎయిర్‌టెల్, అదానీ కనెక్స్, సిఫీ టెక్నాలజీలస్ అనే జాతీయ సంస్థలు డేటా సెంటర్లను నడుపుతున్నాయి. కొత్తగా గూగుల్ (అదానీ కనెక్స్ సహకారంతో), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు కొత్తగా భారీ డేటా సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాయితీలతో అత్యంత ప్రమాదకర డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పోటీ పడుతున్న వాటిలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచేందుకు దారుణమైన రీతిలో ప్రజారోగ్యం, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థలను ఫణంగా పెడుతోంది. సంప్రదాయ డేటా సెంటర్ ఏడాదికి 10-25 మెగావాట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తే, ఎ.ఐ తో నడిచే డేటా సెంటర్ ఏడాదికి 100 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తుంది. ఇది ఒక లక్ష కుటుంబాలు ఏడాదికి వినియోగించే విద్యుత్‌కు సమానం. సర్వర్లు (60 శాతం), సమాచార నిల్వ వ్యవస్థలు (దాదాపు 5 శాతం), నెట్ వర్కింగ్ పరికరాల సంధానం (5 శాతం), ఐటీ పరికరాల వినియోగం (7-30 శాతం) విద్యుత్ వినియోగం పెద్ద ఎత్తున జరిగి స్థానిక విద్యుత్ వ్యవస్థకు పెద్ద అడ్డంకిగా మారుతుంది. విద్యుత్ వినియోగంలో అధిక భాగం ఉష్ణం (వేడి)గా మారుతుంది. దాంతో డేటా సెంటర్లను చల్లబరచవలసి ఉంటుంది. అందుకోసం చల్లగాలి జనరేటర్లను వాడుతున్నప్పటికీ, ప్రధానంగా ఆ ఉష్ణాన్ని నీటి ద్వారా తొలగించడం పరిపాటి. ఒక మెగావాట్ డేటా సెంటర్ కోసం ఏడాదికి 26 మిలియన్ల (రెండు కోట్ల అరవై లక్షల) లీటర్లను వినియోగించాల్సి వస్తుంది. 30 మెగావాట్ల డేటా సెంటర్ కోసం ఏడాదికి 780 మిలియన్ లీటర్ల (అంటే రోజుకు 2,19,700 లీటర్ల) నీటిని వినియోగించాలి. ఇండియాలో పట్టణ ప్రాంతాల్లో రోజుకు తలసరి 135 లీటర్ల నీరు అవసరం. అందువల్ల రోజుకు 1630 మందికి అవసరమయ్యే నీటిని ఖర్చు చేయవలసి వస్తుంది. గూగుల్ 1 గిగావాట్ (వెయ్యి మెగావాట్లు), రిలయన్స్ 1 గిగావాట్, సిఫీ-500 మెగావాట్లు, మెటా-500 మెగావాట్లు, పై-60 మెగావాట్ల లక్ష్యంగా డేటా సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 6 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్లు 2030 నాటికి రాబోతున్నాయి. అంటే, రోజుకు 4,39,40,000 లీటర్లకు పైగా నీటిని డేటా సెంటర్లు వినియోగించబోతున్నాయి. దాంతో డేటా సెంటర్లున్న ప్రాంతాలలో పెద్ద ఎత్తున తాగు/సాగు నీటి కొరత ఏర్పడి ప్రజా జీవనాన్ని అల్లకల్లోలంగా మార్చుతుంది. 2024లో గ్లోబల్ విద్యుత్ వినియోగంలో 1.5 శాతంగా ఉన్న డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం, గత ఐదేళ్లలో ఏడాదికి 12 శాతం చొప్పున పెరిగింది. అదే సమయంలో ఇప్పటికీ విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు వినియోగం 30 శాతం, గ్యాస్ 26 శాతం, అణు శక్తి 15 శాతంగా ఉంది. డేటా సెంటర్లు 27 శాతం విద్యుత్తును ఖర్చు చేస్తుండడంతో, అది మరింత వేగంగా పెరుగుతుండడం, ఇతర పారిశ్రామిక, ప్రజా అవసరాల కోసం గ్లోబల్ విద్యుదుత్పత్తిని పెంచక తప్పని పరిస్థితి. ఇప్పటికే శిలాజ ఇంధనాల నుంచి వెలువడుతున్న హరిత వాయువులను తగ్గించుకోలేని పరిస్థితి కొనసాగుతుండగా, ఈ డేటా సెంటర్ల వల్ల కర్బన ఉద్గారాలు మరింతగా పెరిగే దుస్థితి ఏర్పడుతుంది. పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించే లక్ష్యంతో వివిధ దేశాలు కార్బన్ క్రెడిట్ల లక్ష్యం కోసం అణు విద్యుత్‌పై ఆధారపడవలసిన పరిస్థితి. రాబోయే డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను తీర్చే ఉద్దేశంతో పౌర అణ విద్యుత్ రంగంలోకి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలను అనుమతించేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకొంది. లాభాల కోసం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు (భోపాల్ గ్యాస్ మారణహోమం ఉదంతం) ప్రాణాంతక అణు విద్యుత్ ఉత్పత్తి రక్షణ నియమాలను తుంగలోకి తొక్కి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అత్యధిక విద్యుత్ వినియోగం, భారీగా నీటి వినియోగం, పెద్దఎత్తున డేటా సెంటర్ పరిసరాల్లో ఉష్ణం వ్యాపించడం, ప్రమాదకరమైన ఈ వ్యర్థాలు అనూహ్యమైన స్థాయిలో ఉత్పత్తి కావడం, భరించలేని శబ్ద కాలుష్యం, పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తడం, ఉపాధి కల్పన పరిమితంగా వుండడంతో అమెరికాలో ప్రజలు డేటా సెంటర్ల నిర్మాణానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించారు. దానివల్ల దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో 64 బిలియన్ డాలర్లు పైగా మదుపుతో పెట్టబోయే డేటా సెంటర్ల నిర్మాణం రద్దయింది. అయితే ప్రజా ఉద్యమాల ధాటికి ఉత్పత్తి, ఖర్చును మించిన వ్యర్థాల పరిరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. దీంతో లాభాల మార్జిన్ల కోసం అలాంటి 'రోగ్' పరిశ్రమలను బహుళజాతి సంస్థలు దక్షిణాది వ్యవసాయ దేశాలకు, పేద దేశాలకు తరలిస్తాయి. వెనుకబడిన, వర్ధమాన దేశాల ప్రజలకు ఆయా సంస్థల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించిన సమాచారం కొరవడడం, ప్రభుత్వాలు, పాలక వర్గాలు వ్యర్థ నియంత్రణ వ్యవస్థల ఏర్పాటును పెద్దగా పట్టించుకోక పోవడం వంటివి ఇలాంటి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితి కల్పిస్తుంది. పైగా రాష్ట్ర పాలకులు పెద్ద ఎత్తున విదేశీ మదుపులను ఆకర్షిస్తున్నట్లుగా, అభివృద్ధి, ఉపాధి కల్పన, ఆర్థిక వికాసాన్ని తీసుకొస్తున్నట్లుగా ఫోజులు కొట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రజారోగ్యాన్ని, వ్యవసాయ-పారిశ్రామిక రంగాలను, పర్యావరణాన్ని ధ్వంసం చేసే డేటా సెంటర్లు, ఇథనాల్ ఫ్యాక్టరీలు, పెట్రో కెమికల్ రసాయనాల తయారీ, అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, సోలార్ ప్యానల్ తయారీ ఫ్యాక్టరీ తదితర 'రోగ్ ఫ్యాక్టరీ'ల ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను ప్రజలు సంఘటితంగా తిప్పికొట్టవలసిన తరుణమిది. తస్మాత్ జాగ్రత్త.

# అద్దంకి, కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది

- మొదటి పేజి తరువాయి

కందుకూరు, అద్దంకి ప్రాంతాలను ప్రకాశం జిల్లాలో తిరిగి విలీనం చేయడం శుభపరిణామమన్నారు. ముఖ్యంగా 2012 నుంచి అద్దంకి ప్రాంత ప్రజలు తమ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం, పాలనా సౌలభ్యం కోసం రెవెన్యూ డివిజన్ కావాలని కోరుతున్నారని, వారి విజ్ఞప్తిని మన్నించి అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లు బాపట్ల జిల్లా పరిధిలో ఉండటం వల్ల అద్దంకి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాజా నిర్ణయంతో ఆ కష్టాలు తీరనున్నాయని వివరించారు.

**దుర్గగుడిలో అంతరాయంపై వివరణ**

ఇటీవల విజయవాడ కనకదుర్గ ఆలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై మంత్రి స్పష్టత ఇచ్చారు. ఇది కేవలం అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా జరిగిన ఘటన అని, విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపాలు లేవని స్పష్టం చేశారు. కరెంట్ కేవలం 10 నిమిషాలు మాత్రమే నిలిచిపోయిందని, విషయం తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు జనవరి 6 లేదా 7 తేదీల్లో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈవో, ఇతర ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిన్న పొరపాటును ఆసరాగా చేసుకుని రాజకీయ విమర్శలు చేయడం తగదని వైసీపీ నేతలకు హితవు పలికారు. ప్రజల మనోభావాలతో ముడిపడిన అంశాలపై అనవసర రాద్ధాంతం చేయడం, ప్రతి సాధారణ విషయాన్ని రాజకీయాలకు వాడుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని మంత్రి మండిపడ్డారు. ఏ ధర్మాన్నైనా, సంప్రదాయాలనైనా చిత్తశుద్ధితో కాపాడేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని గొట్టిపాటి రవికుమార్ ఉద్ఘాటించారు.

# గ్రూప్-2 రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు... నియామకాలకు లైన్ క్లియర్

- మొదటి పేజి తరువాయి

పిటిషన్లన్నింటినీ ఏపీ హైకోర్టు కొట్టివేసింది. మంగళవారం వెలువడిన ఈ తీర్పుతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నిర్ణయం లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం కలిగించింది. 2023లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధానంగా మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు (ఎక్స్-సర్వీస్‌మెన్), క్రీడాకారులకు కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు నిబంధనల ప్రకారం లేవని పిటిషనర్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను సరిచేసి, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్తది జారీ చేయాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. అన్ని పిటిషన్లను కొట్టివేయడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఇప్పటికే గ్రూప్-2 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో, ఈ తీర్పు అభ్యర్థుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. రోస్టర్ పాయింట్ల వివాదంతో నియామకాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఈ తీర్పు ఊరటనిచ్చింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో ఏపీపీఎస్సీ తదుపరి నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

# అమిత్ షా వ్యాఖ్యల పై మమతా బెనర్జీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయంటూ అమిత్ షా వ్యాఖ్యానించడం పూర్తిగా రాజకీయ ప్రేరితమని మమత మండిపడ్డారు. బెంగాల్‌లోనే ఉగ్రవాదులు ఉంటే, పహల్గాం, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడులు ఎవరు చేశారో చెప్పాలని ఆమె సూటిగా ప్రశ్నించారు. అలాగే, బెంగాల్ ప్రభుత్వం భూమి ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మాణం జరగడం లేదన్న అమిత్ షా వ్యాఖ్యలను కూడా మమత తీవ్రంగా ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం అవసరమైన భూమిని కేంద్రానికి అప్పగించిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంవల్లే అనేక రైల్వే ప్రాజెక్టులు బెంగాల్‌కు వచ్చాయని గుర్తు చేశారు. బీజేపీ నేతలు కావాలనే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అలాంటి మాటలను బెంగాల్ ప్రజలు ఎప్పటికీ నమ్మరని మమత స్పష్టం చేశారు. ఇక ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం 'ఎస్ఐఆర్' పేరుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కుట్ర పన్నుతోందని మమత తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఇంత హడావిడిగా ఎందుకు చేపడుతున్నారని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక పలువురు బూత్ లెవల్ అధికారులు, ఇతర సిబ్బంది మానసిక ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో సుమారు 1.5 కోట్ల మంది పేర్లను తొలగించేందుకు ప్రయత్నం జరుగుతోందని మమత ఆరోపించారు. ముఖ్యంగా ఆదివాసీలు, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రక్రియను నడుపుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఇలాంటి చర్యలను తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, బెంగాల్ ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడతామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# అనుకున్న దానికన్నా ముందుగానే దర్శనాలు ప్రారంభించాం

- మొదటి పేజి తరువాయి

వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12:05 గంటలకు వైకుంఠ ద్వారాన్ని తెరిచి భక్తులకు అనుమతినిచ్చారు. ముందుగా ఆలయంలో ధనుర్మాస కైంకర్యాలు, ప్రత్యేక హారతులు, నివేదనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ జీయంగార్లు, అర్చకులు, టీటీడీ అధికారులు, పాలకమండలి సభ్యులు సంప్రదాయబద్ధంగా వైకుంఠ ద్వార ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పందిస్తూ... "అనుకున్న సమయం కంటే ముందుగానే భక్తుల కోసం దర్శనాలు ప్రారంభించాం. ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం" అని వెల్లడించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠ ద్వారం గుండా నడిచి స్వామివారి ఆశీస్సులు పొందారు. సీఎం రేవంత్‌కు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. అలాగే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు కూడా స్వామివారి సేవలో పాల్గొన్నారు.

ఈ వైకుంఠ ద్వార దర్శనాలు జనవరి 8 వరకు మొత్తం 10 రోజుల పాటు కొనసాగుతాయి. తొలి మూడు రోజులు కేవలం టోకెన్లు ఉన్నవారికే అనుమతి ఉంటుందని, జనవరి 2 నుంచి సాధారణ భక్తులకు కూడా అవకాశం కల్పిస్తామని టీటీడీ వర్గాలు తెలిపాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని లడ్డూ ప్రసాదం, అన్నదానం, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

# పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి... తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

శాంతి చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ఏ పక్షం కూడా వ్యవహరించకూడదని మోదీ సూచించారు. అందరూ చర్చలపైనే దృష్టి సారించాలని ఆయన కోరారు. రాత్రి వేళ, పుతిన్ ఉంటున్న నొవొగొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ 91 లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. దీనిని ఉగ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వాటన్నింటినీ కూల్చివేశాయని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది. ఉక్రెయిన్ దాడికి రష్యా తగిన సమాధానం చెబుతుందని లావ్రోవ్ హెచ్చరించారు. మరోవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఆదివారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఫ్లోరిడాలోని తన నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఈ చర్చలు చాలా సానుకూలంగా సాగాయని, యుద్ధం ముగింపు దశకు చాలా దగ్గరగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇలాంటి కీలక సమయంలో దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది.

# మందులకు కూడా లొంగని డెడ్లీ ఫంగస్... గతంలో కంటే ప్రాణాంతకం!

- మొదటి పేజి తరువాయి

హెచ్చరించింది. ఢిల్లీలోని వల్లభ్‌భాయ్ పటేల్ చెస్ట్ ఇన్‌స్టిట్యూట్, అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించాయి. ఈ ప్రమాదకరమైన ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 65 లక్షల మందిపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు తెలిపారు. దీని తీవ్రత ఎంతలా ఉందంటే.. యాంటీ ఫంగల్ చికిత్స అందించినప్పటికీ మరణాల రేటు 50 శాతానికి పైగా ఉంటోందని పేర్కొన్నారు. ఇది బహుళ ఔషధాలను తట్టుకునే శక్తిని కలిగి ఉండటం వైద్యులను కలవరపెడుతోంది. కాండిడా ఆరిస్ మానవ చర్మంపై ఎక్కువ కాలం జీవించి ఉండగలదని, అక్కడి నుంచి శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుందని నిపుణులు వివరించారు. ఇది ఈస్ట్ నుంచి ఫిలమెంట్‌గా రూపం మార్చుకోవడం, కణాల సమూహాలను ఏర్పరచుకోవడం వంటి కణ స్థాయి వ్యూహాలతో మనుగడ సాగిస్తోందని 'మైక్రోబయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ రివ్యూస్' జర్నల్‌లో ప్రచురితమైన నివేదిక పేర్కొంది. చర్మంపై, అలాగే నిర్జీవ ప్రదేశాలపై కూడా ఇది గమ్ లాగా అతుక్కుపోతుందని తెలిపారు. దీనివల్ల ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి ఇతరులకు ఈ ఫంగస్ సులభంగా వ్యాపించే ముప్పు ఉందని హెచ్చరించారు. మరోవైపు, సాధారణ ల్యాబ్ పరీక్షల్లో ఈ ఫంగస్‌ను గుర్తించడం కష్టమని, తరచుగా దీనిని వేరే ఈస్ట్‌గా పొరబడే అవకాశం ఉందని, దీనివల్ల చికిత్స ఆలస్యమవుతోందని పరిశోధకులు వివరించారు. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కొత్త రకం యాంటీ ఫంగల్ మందులు, మెరుగైన వ్యాక్సిన్లు, అధునాతన డయాగ్నస్టిక్ పరీక్షలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు సూచించారు.

# ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్

- మొదటి పేజి తరువాయి

అగ్రరాజ్యం అమెరికా జాతీయ రహదారుల నెట్ వర్క్ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది.

ముఖ్యంగా భారత్ మాల పరియోజన వంటి పథకాల ద్వారా భారత్ లో హైవేల రూపురేఖలు మారిపోయాయి. 2014లో కేవలం 93 కిలోమీటర్లుగా ఉన్న యాక్సెస్-కంట్రోల్డ్ హైస్పీడ్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ వేలు ప్రస్తుతం 3,052 కిలోమీటర్లకు పెరిగాయి. అలాగే నాలుగు లేన్ల రహదారులు 18 వేల కిలోమీటర్ల నుంచి 43,512 కిలోమీటర్లకు రెట్టింపయ్యాయి. రాబోయే మూడేళ్లలో మరో రూ.8.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేలా భద్రతా ప్రమాణాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాద బాధితులకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్' ద్వారా రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద సమయంలో సాయం చేసే వారికి (గుడ్ సమారిటన్) ఇచ్చే పారితోషికాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. రవాణా రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు 2026 జనవరిలో పబ్లిక్ ఇన్విట్ (%×అఇ×ు%)ను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. హైడ్రోజన్ ట్రక్కుల ప్రయోగాలు, ఫాస్టాగ్ ఆధారిత టోలింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో భారత రవాణా రంగం కొత్త పుంతలు తొక్కుతోంది.

# ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం.. శత్రువుల డ్రోన్లు, మిస్సైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర %-% ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.

గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు. దేశంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, పౌర కేంద్రాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అప్పుడే ప్రకటించారు. ఈ వ్యవస్థలో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే అధునాతన రాడార్ వ్యవస్థలు, వాటిని మధ్యలోనే కూల్చివేసే ఇంటర్‌సెప్టర్లు, అలాగే సైబర్ యుద్ధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా ఉండనుంది. డీఆర్‌డీవో, ప్రైవేట్ రక్షణ సంస్థలు, భారత సైన్యం కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఇప్పటికే ప్రాథమిక సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, ఢిల్లీ గగనతల భద్రతను ఇనుమడింపజేసే దిశగా సుదర్శన చక్ర ప్రాజెక్ట్ దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఈవీఎం గోదాముల భద్రతపై కలెక్టర్ కఠిన ఆదేశాలు

**రాజకీయ పార్టీల నేతలతో కలిసి గోదాముల త్రైమాసిక తనిఖీ**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, డిసెంబర్ 30** :ఈవీఎం గోదాముల వద్ద భద్రతలో ఎలాంటి నిర్ల క్ష్యం చోటు చేసుకోరాదని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. గ్రామీణ మం డలం చినగదిలిలో ఉన్న ఈవీఎం గోదాములను మంగళవారం త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్‌తో పాటు వివిధ రాజకీ య పార్టీల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.గోదాముల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీల్స్‌ను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. తాళాలు తెరిపించి గోదాముల లోపలి భాగాన్ని కూడా పరిశీలించి, అక్కడ భద్రపరిచిన ఈవీఎంల స్థితి గతులను క్షుణ్ణంగా గమనించారు. భద్రతా ప్ర మాణాలు మరింత పటిష్టంగా అమలు చేయాల ని అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.తనిఖీ సందర్భంగా లాగ్‌బుక్ నిర్వ హణను పరిశీలించిన కలెక్టర్ అందులో సంతకం చేశారు. భద్రతా చర్యలు, లాగ్‌బుక్ నిర్వహణ, ఈవీఎంల భద్రపరిచే విధానం వంటి అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో కాసేపు చర్చించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భద్రపరిచిన ఈవీఎంల వివరాలను ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్థానిక రెవెన్యూ అధికారు లు, ఎన్నికల సెల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# అక్రమ కట్టడాలను తొలగించిన రెవెన్యూశాఖ అధికారులు

**స్థానిక గిరిజనులకు ఒక న్యాయం, గిరిజనేతరులకు ఒక న్యాయమా!**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, డిసెంబర్ 30.**ముంచంగిపుట్టు మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయ సమీపంలో గిరిజనుడు అక్రమ కట్టడాలు కడుతున్నారని రెవెన్యూ శాఖ అధికారులు మంగళవారం గునపం, పారలు పట్టి బేస్మెంట్ను ధ్వంసం చేశారు. అదే 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ మండల కేంద్రంలో యాదేచ్ఛగా గిరిజనేతరులు అక్రమకట్టడలు కడుతున్న వాటిపై మాత్రం రెవెన్యూ శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో పలు విమర్శలు గుప్పుమంటుంది. మండల కేంద్రంలో గిరిజనులకు ఒక న్యాయం, గిరిజనేతరులకు ఒక న్యాయం చేస్తూన్నా మండల రెవెన్యూ శాఖ అధికారులపై గిరిజనులు బాహటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మండల కేంద్రంలో గత కొన్ని ఏళ్లుగా గిరిజనేతరులు గిరిజన చట్టాలు హక్కులకు కాలరాస్తూ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నప్పటికీ స్థానిక రెవిన్యూ శాఖ అధికారులు కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో అదునుగా చూసుకుని అక్రమ కట్టడాలు కట్టుకొని పోతున్నారు. గిరిజనేతరులు కడుతున్న అక్రమ కట్టడాలను అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూన్నారని, వారు అందించే ముడుపులు తీసుకొని ఎటువంటి కేసులు నమోదు చేయకుండా పూర్తి అండదండాలు అందిస్తున్నారని పలువురు గిరిజన ప్రజలు ఆరోపిస్తున్నారు. అదే గిరిజనుడైతే ప్రభుత్వ స్థలంలో వచ్చి ఓ చిన్న పాక వేసుకుంటే పారలు, గునపాలు పట్టి రెవెన్యూ శాఖ అధికారులు ధ్వంసం చేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా మండల రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని మండల వాసులు కోరుతున్నారు. అక్రమ కట్టలు కడుతున్న గిరిజనేతరులపై ఎల్టీఆర్ కేసులు తక్షణమే నమోదు చేయాలని గిరిజన ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పురుషోత్తముని దర్శించుకునే రోజు ముక్కోటి ఏకాదశి



మూడు కోట్ల దేవతలతో భువికి దిగివచ్చి భక్తులకు దర్శనం ఇచ్చిన రోజు

**విశాఖ తూర్పు,పెన్ పవర్,డిసెంబర్ 30**:ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశి తో సమానం అందుకే ఈరోజు ముక్కోటి ఏకాదశి అంటారు. ఏకాదశి రోజున మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తారని నమ్మకం అందుకే దీనికి ముక్కోటి ఏకాదశిగా పేరు వచ్చింది,

ఈరోజునే క్షీరసాగరతో అమృతాలు పుట్టాయని అంటారు ఏకాదశి ఉపవాస నుండి అన్నదానం చేస్తే మంచిదని చెబుతారు ఏకాదశి వ్రతంలో ఏడు నియమాలు ఉన్నాయి,ఏకాదశి రోజు మొత్తం ఉపవాసం ఉండి ఏడు నియమాలు పాటించాలి, చివరిగా అన్నదానం చేయాలి. ముక్కోటి దేవతలు వేచి ఉండే పుణ్య దినం ఉత్తర ద్వారం నుండి పురుషోత్తముని దర్శించుకునే అద్భుతమైన రోజుమహావిష్ణువు తేజం నుంచి ఆవిర్భవించిన ఏకాదశి ప్రత్యేకమైనది,ముక్కోటి ఏకాదశి దీనినే వైకుంఠ ఏకాదశి లో పిలుస్తారు.

ఏకాదశి పర్వదినాన్ని అరిలోవ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం.తోటగరువు ఈస్ట్ ద్వారక శ్రీకృష్ణ ఆలయంలో తెల్లవారు నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ మురళీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదలను అందించారు.భక్తులకు సౌకర్యార్థం ఏర్పాట్లను చేశారు.

## ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలి

**కూటమి ప్రభుత్వాన్ని కోరిన జనసేన నేత గొర్లె వీరవెంకట్**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, డిసెంబర్ 30:**ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం తక్షణమే ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని జనసేన నేత వీరవెంకట్ కోరారు. నేటి పిల్లలే రేపటి భవిష్యత్తని, చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని ఆయన పేర్కొన్నారు. కేజీబీవీ, ఏకలవ్య పాఠశాలల్లో ఉన్నట్టే ఆశ్రమ పాఠశాలల్లో కూడా వైద్య సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లు పనిచేశారని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వారిని తొలగించడం వల్ల పిల్లలు అనారోగ్యానికి గురైనప్పుడు పర్యవేక్షణ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. కొన్ని సందర్భాల్లో పరిస్థితి ప్రాణాపాయం దాకా వెళ్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజన ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును పరిగణనలోకి తీసుకుని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ సహకారంతో హెల్త్ అసిస్టెంట్లను త్వరితగతిన నియమించాలని కోరారు.గిరిజన ప్రాంత ప్రజలు గతంలో ఏ పార్టీకి మద్దతు ఇచ్చినా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎటువంటి ద్వేషభావం లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.ఈ ప్రభుత్వంపై గిరిజన ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, వారి ప్రతి సమస్యను ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని పరిష్కరించాలని వీరవెంకట్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

# వారం రోజుల్లో ఎంఎస్ఎంఈ నానో పార్కుల సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, డిసెంబర్ 30** :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎం ఎస్ఎంఈ నానో పార్కుల ఏర్పాటును వేగవం తం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో అవసరమైన అన్ని సాంకేతిక ప్రక్రియలను పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో నిర్వహించిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో కలెక్టర్ ఈ అంశాల పై సమీక్షించారు. జిల్లాలోని ఏడు నియోజ కవర్గాల పరిధిలో ఇప్పటికే స్థలాల గుర్తింపు పూర్తైన ప్రాంతాల్లో వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని, ఇంకా గుర్తించని ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో అనువైన స్థలాలను త్వరిత గతిన గుర్తించాలని సూచించారు.పారిశ్రామిక ప్రాంతాల్లో మౌలిక వసతులు, రవాణా సౌకర్యా లు కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్న కలెక్టర్, ఆటోనగర్, మధురవాడ ఐటీ పార్కు ప్రాంతాల్లో బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక బస్సులు నడపాలని ఆదేశిం చారు. ఈ మేరకు టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని జీవీఎంసీ అధికారులకు సూ చించారు.తుంగ్లాం వద్ద రైల్వే ట్రాక్‌ల మధ్యలో ఉన్న ప్రభుత్వ భూమి వినియోగం లేదా ప్రత్యా మ్నాయ స్థల కేటాయింపు అంశంపై రైల్వే శాఖకు లేఖ రాసి తదుపరి చర్యలు తీసుకోవాల ని అధికారులను ఆదేశించారు. గాజువాక, ఆటోనగర్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న రోడ్ ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేసి, జూన్ తొలి వారానికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. జనవరి 10 నాటికి రోడ్ డెవలప్ మెంట్ ప్లాన్‌ను ప్రచురించాలన్నారు. కంచరపా లెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో తాగునీటి సమ స్యపై ఐలా ఛైర్మన్ చేసిన విజ్ఞప్తికి స్పందించిన కలెక్టర్, తక్షణ చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసర మైన రూ.1.47 కోట్ల నిధుల కేటాయింపుకు సంబంధించి ఏపీఐఐసీ ఎండీకి లేఖ రాయాలని స్థానిక అధికారులకు సూచించారు.పీఎంఈజీపీ పథకం కింద మరిన్ని ప్రాజెక్టులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించేలా ప్రోత్స హించాలని పరిశ్రమల శాఖ అధికారులకు సూచించారు. ఇప్పటికే భూ కేటాయింపులు పొందిన వారు ఆరు నెలల లోపు పరిశ్రమలు నెలకొల్పకపోతే నోటీసులు జారీ చేయాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన సహా ఇతర అంశాలపై కూడా సుదీర్ఘంగా చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఉద్యోగాలు కోల్పోయిన కా ర్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి ఇటీవల దువ్వాడ వీసెజ్‌లోని సినర్జీస్ దూరే సంస్థలో అనివార్య కారణాల వల్ల ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు ప్రత్యామ్నా య ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ అంశంపై సంబంధిత యూ నియన్ ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని పరిశ్రమల శాఖ అధికారులను సూచించారు. కార్మికుల అర్హత లు, నైపుణ్యాలు, ఆసక్తులను గుర్తించి తగిన ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకో వాలని తెలిపారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆదిశే షు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం, ఐలా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైల్వే,వాణిజ్యం,రక్షణ కమిటీల పర్యటనలపై సమన్వయ సమావేశం

**జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్పష్టమైన ఆదేశాలు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, డిసెంబర్ 29** :జనవరి నెలలో జిల్లాకు రానున్న రైల్వేలు, వాణి జ్యం, రక్షణ శాఖలకు చెందిన మూడు పార్లమెం టరీ స్టాండింగ్ కమిటీల పర్యటనలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధి కారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పని చేసి ఎక్కడా ఎలాం టి లోపాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళ వారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఈ అంశాలపై సమీక్షించారు. కమిటీల పర్యటనల సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు, రవాణా, వసతి, విమానాశ్ర యంలో స్వాగత ఏర్పాట్లు, స్థానిక పర్యాటక ప్రాంతాల సందర్శనలు వంటి అన్ని కార్యక్రమా లను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలన్నా రు.ప్రతి శాఖకు కేటాయించిన నోడల్ అధికారు లు, లైజన్ అధికారులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కమిటీ సభ్యులకు స్థానిక సంప్రదాయాలు, సంస్కృతి పరిచయం చేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించా రు. స్థానిక భాష, ప్రాంతీయ అంశాలపై అవగా హన ఉన్న అధికారులనే లైజన్, నోడల్ అధికా రులుగా నియమించాలని సంబంధిత శాఖలకు సూచించారు.

సమావేశంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ కమాండర్, డీఐజీ రాజేష్ మిట్టల్ మాట్లాడుతూ డిఫెన్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటనకు సంబంధించి తీసుకోవాల్సిన ఏర్పాట్లను వివరిం చారు. ఈ పర్యటనలో జిల్లా యంత్రాంగం నుం చి అందాల్సిన సహకారంపై స్పష్టతనిచ్చారు.

ఈ సమావేశంలో ఎంపెడా జాయింట్ డైరెక్టర్ డా. ఖందన్, కాంకోర్ ప్రతినిధి కె. అరుణ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. పార్ల మెంటరీ స్టాండింగ్ కమిటీల పర్య టనల వివరాలు రైల్వే స్టాండింగ్ కమిటీ

ఎంపీ సీఎం రమేశ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ జనవరి 3న విశాఖపట్నానికి రానుంది. జనవరి 5వ తేదీ వరకు ఈ కమిటీ జిల్లాలో పర్యటించనుంది. ఇందులో లోక్‌సభ నుంచి 20 మంది, రాజ్యసభ నుంచి 10 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటనలతో పాటు గ్రాండ్ బే హోటల్‌లో జిల్లా అధికారులతో సమావేశం జరగనుంది. ఈ కమిటీ పర్యటనకు కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకోర్) నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.

వాణిజ్య పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ :
ఎంపీ డోలా సేన్ ఛైర్మన్‌గా ఉన్న వాణిజ్య పార్ల మెంటరీ స్టాండింగ్ కమిటీ జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనుంది. ఈ కమి టీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 9 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెం ట్ అథారిటీ (ఎంపెడా) నోడల్ ఏజెన్సీగా వ్యవ హరిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షించనుంది. నోవాటె ల్ హోటల్‌లో అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

రక్షణ శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ :
ఎంపీ రాధామోహన్ సింగ్ నేతృత్వంలోని రక్షణ శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ జనవరి 19 నుంచి 21వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో పర్యటించనుంది. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 20 మంది, రాజ్యసభ నుంచి 10 మంది ఎంపీ లు పాల్గొంటారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ పర్యటన ఏర్పాట్లను సమన్వయం చేస్తోంది. నోవాటెల్ హోటల్‌లో కమిటీ సమావేశం జరగనుంది.



# జీకే వీది మండలానికి పూర్తిస్థాయి ఏటిడబ్ల్యూఓ నియామకం చేయాలి

* ప్రభుత్వాన్ని కోరిన గాలికొండ ఎంపిటిసి బుజ్జి బాబు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,డిసెంబర్ 30:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీది మండలానికి ప్రత్యేకంగా పూర్తిస్థాయి ఏటిడబ్ల్యూఓను నియమించాలని గాలికొండ ఎంపిటిసి అంపురంగి బుజ్జి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు.జీకే వీది మండలంలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే మండలానికి పూర్తిస్థాయి ఏటిడబ్ల్యూఓ తప్పనిసరిగా అవసరమని ఆయన పేర్కొన్నారు.ఏటిడబ్ల్యూఓ నిరంతరం పాఠశాలలను సందర్శిస్తూ పర్యవేక్షణ చేపట్టినట్లయితే ఇటువంటి ఘటనలను ముందే నివారించవచ్చని తెలిపారు.గత ఆదివారం సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పాంగి నందిని మృతి చెందడం, గత నెలలో జర్రెల బాలుర ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకోవడం వంటి సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు.పాఠశాల సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, తగిన మార్గనిర్దేశం చేసినట్లయితే ఈ సంఘటనలు జరిగి ఉండేవి కావని అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో తక్షణమే స్పందించి జీకే వీది మండలానికి పూర్తిస్థాయి ఏటిడబ్ల్యూఓను నియమించాలని కోరారు.అదేవిధంగా ప్రతి పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్లను నియమించడంతో పాటు, పిల్లలకు భోజనం తయారు చేయడానికి సరిపడా వంటవారిని నియమించాలని ప్రభుత్వాన్ని బుజ్జి బాబు డిమాండ్ చేశారు.

# నందిని మృతికి నిర్లక్ష్యమే కారణం

* బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : గిరిజన విద్యార్థి సంఘం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, డిసెంబర్ 30:**అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీది మండలం సీలేరు జీటిడబ్ల్యూ (బాలికల) ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఆరో తరగతి విద్యార్థిని పాంగి నందిని మృతికి పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి బూడిదే మాధవరావు ఆరోపించారు. నిమ్మగొంది గ్రామానికి చెందిన నందిని అనారోగ్యానికి గురైనప్పటికీ సరైన వైద్యం అందించకపోవడం వల్లే ఆమె మృతి చెందిందని తెలిపారు. విద్యార్థిని చివరి రోజు వరకు పట్టించుకోకపోవడం పాఠశాల వార్డెన్, హెచ్ఎంల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు.సీలేరు జీటిడబ్ల్యూ (జి) ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వార్డెన్‌కు ఒకే సమయంలో అనేక పాఠశాలలు, హాస్టళ్ల బాధ్యతలు ఉండడం వల్ల పర్యవేక్షణ లోపించిందని చెప్పారు. విద్యార్థిని ఒక్కరోజు వ్యవధిలో మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వల్లే మరణాలు పెరుగుతున్నాయని విమర్శించారు. ప్రతి పాఠశాలకు హెల్త్ వాలంటీర్లను నియమించాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. నందిని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా కింద నష్టపరిహారం చెల్లించాలని, నిర్లక్ష్యానికి బాధ్యులైన వార్డెన్, హెచ్ఎంలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.?

# గాజువాక రోటరీ క్లబ్ ఆఫ్ సమత ద్వారా 35000 విలువగల స్మార్ట్ విజన్ గ్లాస్సెస్ అందజేత



**గాజువాక :పెన్ పవర్ ,డిసెంబర్ 30 :**పారిశ్రామిక ప్రాంతం గాజువాక సమత రోటరీ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ సిరట్ల శ్రీనివాస్ మరియు పాస్ట్ ట్రెజర్ హిమంత్ ఆధ్వర్యంలో సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కనకాల శివ సౌజన్యంతో 35000 రూపాయలు విలువ గల స్మార్ట్ విజన్ కళ్ళజోడు ను కొత్త వలస, కంటికాపల్లి లో నివసించు మాడుగుల శ్రావణి కి స్వగృహంలో అందజేయడం జరిగింది అని సిరట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కంటి అద్దాలు ఎంతో ప్రత్యేకమైన వని అవి పెట్టుకోవడం వలన దాదాపు 50% కంటిచూపు వచ్చినట్టేనని నడకదారిలో వచ్చే ఎత్తు పల్లాలు గాని రోడ్డుమీద వాహనాలను గాని అది గుర్తించి ఆడియో ద్వారా ముందుగానే ఆండ్రాయిడ్ ఫోన్ గాని ఆపిల్ ఫోన్ గాని అనుసంధానమై ఉండుటవలన అది సూచిస్తుంది అని అంతేకాకుండా కళ్ళజోడుకున్న కెమెరా ద్వారా మనుషుల్ని కూడా గుర్తిస్తుంది, ముఖ్యంగా ప్రయాణ సమయంలోని మరియు చదువుకునేటప్పుడు బాగా ఉపయోగపడుతుంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్ మరియు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రిష్టి వరల్డ్ స్కూల్ ఆవిష్కరణ- ఫ్యూచరైజ్ 2026

* ఈరోజు ఆలోచన - రేపటి రూపకల్పన
* విద్య, నవీనత, సంస్కృతి సమ్మేళనంగా జిల్లా స్థాయి మహోత్సవం




**గాజువాక :పెన్ పవర్ ,డిసెంబర్ 30 :** ఉక్కునగరం సెక్టర్ - 11 లో శ్రిష్టి వరల్డ్ స్కూల్ తన చరిత్రలో ఒక కీలక మైలురాయిని నమోదు చేస్తూ ఫ్యూచరైజ్ 2026 - ఈరోజు ఆలోచన, రేపటి రూపకల్పన అనే శీర్షికతో 2026 జనవరి 3వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి ఘనమైన గ్రాండ్ ఫినాలేకు సిద్ధమవుతోందని ,. ఈ కార్యక్రమం పాఠశాల స్థాపించి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంస్థ సేవా ప్రయాణాన్ని సూచించే పెర్ల్ జూబిలీ - ప్రతిభా పరంపరను గుర్తు చేసుకుంది.

వేగంగా మారుతున్న సాంకేతిక, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ఫ్యూచరైజ్ భవిష్యత్ విద్యను పునఃఆలోచించాలనే దృఢ సంకల్పానికి శ్రిష్టి వరల్డ్ స్కూల్ ప్రతీకగా నిలుస్తుంది. ఈ థీమ్‌ను మరియు దాని అనుబంధ కార్యక్రమాలను స్వీకరించడానికి ప్రధాన ఉద్దేశం విద్యార్థులు సమాజంలో భవిష్యత్ సంసిద్ధతపై అవగాహన కల్పించడమే.

కృత్రిమ మేధస్సు , ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో సంప్రదాయ వృత్తులు మార్పులకు లోనవుతుండగా, కొత్త నైపుణ్యాలను కోరే కొత్త ఉద్యోగ అవకాశాలు ఉద్భవిస్తున్నాయి. ఈ మార్పులను ఎదుర్కొనడానికి విద్యార్థుల్లో అనుకూలత, వినూత్న ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, విమర్శనాత్మక ఆలోచన మరియు ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలు అత్యవసరం. ఈ వాస్తవాన్ని గుర్తించిన శ్రిష్టి వరల్డ్ స్కూల్, ఏమి నేర్చుకుంటున్నాం అన్నదానికన్నా ఎలా నేర్చుకుంటున్నాం అనేదానిపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ప్రాధాన్యతనుస్కూల్ యాజమాన్యం గుర్తించిందన్నారు . అందులో భాగంగా స్టెమ్ విద్య, కోడింగ్, డిజిటల్ లిటరసీపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు .

ఫ్యూచరైజ్ 2026 మూడు ప్రతిష్టాత్మక ప్రీ-కల్మినేషన్ కార్యక్రమాలైన ఇగ్నీషియా , అసెండియా , ఇన్నోవేటియాల సమ్మేళనంగా రూపుదిద్దుకుంది. అనుభవాత్మక విద్య, ప్రాథమిక దశ నుంచే వృత్తి అవగాహన, కృత్రిమ మేధస్సుకు సిద్ధమైన విద్యా విధానాల ద్వారా నేర్చుకునే ప్రక్రియను కొత్త దిశలో తీర్చిదిద్దడమే వీటి లక్ష్యం అని, ఇవన్నీ కలిసి విద్యార్థులను పరీక్షలకే కాదు, జీవితానికి మరియు భవిష్యత్ వృత్తులకు సిద్ధం చేయాలనే శ్రిష్టి వరల్డ్ స్కూల్ దూరదృష్టిని ప్రతిబింబిస్తున్నాయని ,

ఈ కార్యక్రమాలన్నీ ఫ్యూచరైజ్ మూడు ప్రధాన స్థంభాలైన %-% భవిష్యత్ నైపుణ్యాలు, అనుభవాత్మక విద్య, వృత్తి సిద్ధతపై ఆధారపడి ఉన్నాయి. కేవలం ప్రాక్టికల్ లెర్నింగ్ గానీ, కేవలం డిజిటల్ లెర్నింగ్ గానీ సంపూర్ణ విద్యను అందించలేవని నమ్మే శ్రిష్టి వరల్డ్ స్కూల్, బ్లెండెడ్ లెర్నింగ్ విధానాన్ని బలంగా సమర్థిస్తోందని ,

వార్షికోత్సవ వేడుకలో ప్రధాన ఆకర్షణగా 700 మందికి పైగా శిక్షణ పొందిన విద్యార్థులు ఆకర్షణీయమైన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నారని, 6,000 మందికి పైగా తల్లిదండ్రులు మరియు అతిథులు వీక్షించనున్న ఈ ప్రదర్శనలో సృజనాత్మకత, క్రమశిక్షణ, సాంస్కృతిక వైభవం మరియు 30 సంవత్సరాల శ్రమను ప్రతిబింబిస్తూ భావోద్వేగపూరితమైన అనుభూతిని అందించనున్నాయన్నారు .

ఇగ్నీషియా 2025 అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించబడుతూ, 3వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు 80కి పైగా ఇంటరాక్టివ్ సైన్స్ ఎగ్జిబిట్ల ద్వారా ప్రత్యక్ష అనుభవాన్ని అందించింది. పరిశీలన, భాగస్వామ్యం, డాక్యుమెంటేషన్ ద్వారా భావనాత్మక అవగాహనను పెంపొందించింది.

అసెండియా 2025, 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు నిర్మితమైన వృత్తి అవగాహన కార్యక్రమంగా, ఏ ఐ , రీసెర్చ్, డిజిటల్ మీడియా, ఇంటర్‌డిసిప్లినరీ వృత్తులు వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై స్పష్టతను అందించింది. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జోస్యుల గౌరీ శంకర్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు .

ఇన్నోవేటియా 2025, జియో పీసీ%-%ఎంబైబ్ సహకారంతో నిర్వహించబడుతూ, శ్రిష్టి వరల్డ్ స్కూల్‌ను ఏ ఐ -రెడీ స్కూల్‌గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేసింది. ఏ ఐ లిటరసీ, నైతిక అవగాహన, ఇండస్ట్రీ-రికగ్నైజ్డ్ సర్టిఫికేషన్లను విద్యార్థులకు అందిస్తోంది.

విద్యా మరియు సాంస్కృతిక కార్యక్రమాలకు మించి, 2026 జనవరి 3ననిర్వహించనున్న ఫ్యూచరైజ్‌లో ఫుడ్ స్టాల్స్, లక్కీ డ్రాలు, ఆతిథ్య కార్యక్రమాలతో కూడిన ఉత్సాహభరిత వాతావరణం నెలకొననుంది. ఇది కుటుంబ సమేతంగా ఆనందించదగిన సంపూర్ణ వేడుకగా నిలవనుంది.

ప్రెస్ మీట్ సందర్భంగా మీడియాను ఉద్దేశించి పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, ఫ్యూచరైజ్ 2026 కేవలం ఒక కార్యక్రమం కాదుబీ విద్య వినోదంతో, నేర్చుకోవడం వేడుకతో మిళితమయ్యే ఒక చారిత్రక అనుభవం అని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ పి.సుశీలా రాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘన కంభం,అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రిక ఈరంకి ,చీఫ్ అకాడమిక్ హెడ్ సంతోష్ కుమార్ ,ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపల్ కిరణ్ దేవగిరి సమావేశం లో పాలుగొన్నరు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలతో కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ



* మహిళలు, రైతులు, బలహీన వర్గాలపై ప్రత్యేక దృష్టి
* సంక్షేమ వ్యయం - ఆర్థిక భరోసా
* మీడియా సమావేశంలో మాట్లాడిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, డిసెంబర్ 30 :** స్థానిక పశ్చిమ నియోజకవర్గం, గోపాలపట్నం కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు నిర్వహించిన మీడియా సమావేశం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలనపై ఒక సమగ్ర చిత్రాన్ని చూపించింది. ఎన్నికల హామీలను ఆచరణలోకి తీసుకొచ్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో "సూపర్ హిట్" అయ్యాయని గణబాబు తెలిపారు. ముఖ్యంగా తల్లికి వందనం పథకం ద్వారా రూ.10,090 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయడం, 67.27 లక్షల మంది విద్యార్థులకు సహాయం అందించడం విద్యా రంగంలో ప్రభుత్వ ప్రాధాన్యతను సూచిస్తోంది.

మహిళలు, రైతులు, బలహీన వర్గాలపై ప్రత్యేక దృష్టి..

స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం ద్వారా ఇప్పటివరకు 3.25 కోట్ల ప్రయాణాలు జరగడం, దీనికి రూ.1,144 కోట్ల వ్యయం కావడం మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలుస్తోంది. అదే విధంగా దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం సామాజిక సమానత్వానికి ప్రభుత్వ కట్టుబాటును చూపిస్తోంది. రైతుల కోసం అమలవుతున్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు జమ చేయడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే చర్యగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సంక్షేమ వ్యయం - ఆర్థిక భరోసా..

దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇప్పటికే దాదాపు రెండు కోట్ల సిలిండర్ల పంపిణీ జరగడం పేద కుటుంబాలపై భారం తగ్గించిందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ఎన్టీఆర్ భరోసా ద్వారా పెన్షన్లకు ఇప్పటివరకు రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేయడం సంక్షేమ వ్యయంలో ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోంది.

వృత్తి వర్గాలకు మద్దతు..

మత్స్యకార భరోసా, నేతన్నలకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లకు వార్షిక సహాయం వంటి పథకాలు వృత్తి ఆధారిత వర్గాలకు ఆర్థిక స్థిరత్వం కల్పిస్తున్నాయని గణబాబు పేర్కొన్నారు. అన్నా క్యాంటీన్ల ద్వారా కోట్లాది మందికి తక్కువ ధరకే భోజనం అందించడం పేదల ఆకలి సమస్యకు పరిష్కారంగా నిలుస్తోంది. సామాజిక సమతుల్యత దిశగా అడుగులు ఎస్సీ వర్గీకరణను వివాదాలకు తావివ్వకుండా అమలు చేయడం, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, మైనారిటీ సంక్షేమానికి వేల కోట్ల వ్యయం వంటి అంశాలు ప్రభుత్వ సామాజిక సమతుల్యత విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి. పాస్టర్లు, ఇమాములు, మౌజన్లకు గౌరవ వేతనాలు కూడా మతపరమైన సేవలను గౌరవించే విధానంగా చూడవచ్చు.

ఎమ్మెల్యే గణబాబు రాజకీయ సందేశం..

ఈ సందర్భంగా గణబాబు గత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహా కూటమి నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా, ఈ మీడియా సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం సంక్షేమమే కేంద్రబిందువుగా పాలన సాగిస్తోందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఉందని స్పష్టమవుతోంది. నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరడం ఈ సమావేశానికి సామాజిక స్పర్శను కూడా జోడించింది.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ కి, జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, కూటమి పెద్దలందరికీ కూడా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రజలకు, పశ్చిమ నియోజకవర్గం ప్రజలందరూ కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు అలాగే సంక్రాంతి శుభాకాంక్షలు గణబాబు తెలియపరిచారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాలతో ఉండాలని మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కోరారు.

# అసంఘటిత కార్యకలాపాలకు నో ఛాన్స్

సర్కిల్ ఇన్ స్పెక్టర్:- ఎం వినోద్ బాబు



**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 30:-** చింతపల్లి సర్కిల్ పరిధిలోని ప్రజలకు నాయకులకు అధికారులకు సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎం వినోద్ బాబు , ఎస్సై వీరబాబు, వెంకటరమణ లు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అల్లూరు జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు, చింతపల్లి ఏఎస్పి నవజ్యోతి మిశ్రా సూచనలతో ఈ ఏడాది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని ముఖ్యంగా కుర్రాళ్ళు మత్తు పదార్థాలు సేవించి బైక్ డ్రైవింగ్ లు చేయరాదని, అల్లర్లు సృష్టించరాదని, అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా ఎలాంటి పనులు చేసిన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# సుపరిపాలన దిశగా టీడీపీ ముందడుగు

కార్యకర్తల గౌరవంతో సంస్థాగత బలోపేతం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, డిసెంబరు 30 :** జీవీఎంసీ 92వ వార్డ్, గోపాలపట్నం మెయిన్ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమం ద్వారా తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా మరో కీలక అడుగు ముందుకు వేసింది. ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం కేవలం సన్మాన సభగా కాకుండా, పార్టీ అంతర్గత బలోపేతానికి స్పష్టమైన సంకేతంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉత్తమ సేవలందించిన కార్యకర్తలను ఎంపిక చేసి ప్రశంసపత్రాలతో సత్కరించడం ద్వారా, పార్టీ నాయకత్వం కార్యకర్తల పాత్రకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో స్పష్టమైంది. రాజకీయ పార్టీల విజయంలో నాయకత్వంతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలే కీలకమన్న సందేశాన్ని ఈ కార్యక్రమం బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది.

ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ మంచి పాలనకు పునాది కార్యకర్తల కష్టపాటేనని, సుపరిపాలన లక్ష్యాన్ని సాధించడంలో ప్రతి కార్యకర్త భాగస్వామిగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇది పార్టీ



భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే అంశంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డ్ కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్‌తో పాటు జిల్లా నాయకులు, వార్డ్ నాయకులు, మహిళా నాయకులు, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బూత్ కన్వీనర్లు, కేఎస్ఎస్ సభ్యులు పాల్గొనడం ద్వారా పార్టీ నిర్మాణంలో అన్ని స్థాయిల సమన్వయం కనిపించింది. మొత్తంగా చూస్తే, ఈ కార్యక్రమం ద్వారా టీడీపీ కార్యకర్తల్లో ఉత్సాహం




నింపడమే కాకుండా, రానున్న రోజుల్లో పాలన, రాజకీయ వ్యూహాల్లో క్రమబద్ధమైన, క్షేత్రస్థాయి ఆధారిత దృక్పథాన్ని అనుసరించనున్నట్టు స్పష్టమవుతోంది. ఇది నియోజకవర్గ రాజకీయాల్లో టీడీపీకి సానుకూల ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సింహాచలంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు





## భక్తి, నిర్వహణ, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం

**సింహాచలం, పెన్ పవర్, డిసెంబర్ 30 :** ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి వేడుకలు, ఈ ఏడాది కేవలం ఆధ్యాత్మిక పరంగానే కాకుండా, నిర్వహణా సామర్థ్యం, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం, భక్తుల సౌకర్యాల పరంగా కూడా ఆదర్శవంతంగా నిలిచాయి.

ఆధ్యాత్మిక ప్రాముఖ్యత వైకుంఠ ద్వార దర్శనానికి విశేష స్పందన..

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పించడం సింహాచల క్షేత్రంలో అత్యంత పవిత్రమైన ఘట్టం. తెల్లవారుజామున 1 గంటకే సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు, భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తుల హాజరు, ఈ పర్వదినానికి ఉన్న అపారమైన విశ్వాసాన్ని స్పష్టంగా ప్రతిబింబించింది.

ప్రజాప్రతినిధుల హాజరు..

దేవస్థానం–ప్రభుత్వ అనుసంధానం

ఉత్తర ద్వార దర్శనానంతరం ఆలయ ధర్మకర్త కుటుంబం, భీమిలి ఎమ్మెల్యే మరియు మాజీ మంత్రి శ్రీ గంటా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ శ్రీ గణబాబు తదితర ప్రముఖుల దర్శనం జరిగింది. ఈ సందర్భంగా 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరగడం, దేవస్థానం కార్యకలాపాల్లో ప్రజాప్రతినిధుల చురుకైన పాత్రను సూచిస్తుంది.

భక్తులకే పెద్దపీట – పాలనా నిర్ణయాల విశ్లేషణ

ఈ వేడుకల్లో ముఖ్యంగా గమనించాల్సిన అంశం విఐపి సంస్కృతికి పరిమితి, సామాన్య భక్తులకు ప్రాధాన్యం. ఆర్జిత సేవలను రద్దు చేసి లఘు దర్శనానికే అనుమతి. ప్రతి భక్తుడికి సగటున 15 నిమిషాల దర్శన సమయం

విరామ సమయం తప్ప, నిరంతర దర్శన ఏర్పాట్లు. ఇవి దేవస్థానం తీసుకున్న ప్రజాహిత నిర్ణయాలుగా చెప్పవచ్చు.

తిరివీధి ఉత్సవం – సంస్కృతి.. సంప్రదాయాల సమన్వయం..

తిరివీధి ఉత్సవం ద్వారా ఆలయ సంప్రదాయాలు ప్రజల మధ్యకు రావడం విశేషం. వేద మంత్రోచ్చారణ, నాదస్వరాలు, కోలాటాలు, భరతనాట్య ప్రదర్శనలు ఇవన్నీ సింహాచల క్షేత్రాన్ని ఒక జీవంత సాంస్కృతిక వేదికగా మార్చాయి.

సౌకర్యాలు, భద్రత..సమన్వయ పాలనకు ఉదాహరణ..

భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత పొంగలి ప్రసాదం, మంచినీరు, మజ్జిగ, బిస్కెట్లు,

వైద్య శిబిరాలు, పోలీస్, రెవెన్యూ, ఫైర్, మెడికల్, జీవీఎంసీ శాఖల సమన్వయం విజయవంతమైన గణనీయమైన అంశం. దేవస్థానం ఈవో ఎన్. సుజాత నాయకత్వంలో నిర్వహణ ప్రశంసనీయంగా నిలిచింది.

ముక్కోటి ఏకాదశి సమగ్రంగా చూస్తే..

ఈ ఏడాది సింహాచలం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఆధ్యాత్మిక పరవశం, ప్రజాహిత పాలన, సాంస్కృతిక వైభవం, నిర్వహణా నైపుణ్యం, అన్నింటినీ ఏకకాలంలో ప్రతిబింబించాయి. ఇది భవిష్యత్తులో ఇతర ప్రధాన ఆలయాలకు ఒక మోడల్ ఫెస్టివల్ మేనేజ్‌మెంట్ ఉదాహరణగా నిలిచే అవకాశముంది.

## శ్రీవారిని దర్శించుకున్న జనసేన నేత,ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు



**పెందుర్తి, పెన్ పవర్, డిసెంబర్ 30 :** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గ శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు తిరుమల, తిరుపతి దేవస్థానంలో స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఉదయం 3 గంటల సమయంలో, వైకుంఠ ఏకాదశి ప్రత్యేకతగా తెరుచుకునే ఉత్తర ద్వారం ద్వారా శ్రీవారి మూలమూర్తిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం టీటీడీ దేవస్థానం అధికారులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దీనికి కొనసాగింపుగా, అక్కడే ఉన్న వేద పండితుల ఆశీర్వాదాన్ని పంచకర్ల రమేష్ బాబు స్వీకరించారు. ఈ పవిత్ర సందర్భంగా శ్రీవారి కృపతో ప్రజలందరికీ శాంతి, సుభిక్షం, ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ దర్శన కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు, అలాగే సన్నిహిత మిత్రులు కూడా పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి దర్శనం కలగడం విశేష ఫలదాయకమని భక్తులు భావిస్తారు.ం

## టీడీపీ కార్యకర్త భీమా పత్రాలు మంగళగిరిలో సమర్పణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, డిసెంబర్ 30:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రింతాడా పంచాయతీ ఆసరాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సలిమితి జగదీశ్వరరావుకు పార్టీ అందించే భీమా మొత్తానికి సంబంధించిన పత్రాలను మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సమర్పించినట్లు సంకాడ పంచాయతీ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు తెలిపారు. మరణించిన కార్యకర్త కుటుంబానికి పార్టీ తరపున రూ.5 లక్షల భీమా మంజూరు చేయించేందుకు అవసరమైన పత్రాలను అందజేశామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పార్టీ సీనియర్ కార్యకర్త జగదీశ్వరరావు సేవలను నేతలు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో సంకాడ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, లకవరపు పేట గ్రామ కమిటీ అధ్యక్షులు శెట్టి రామారావు, మండల ట్రెజరర్ తగ్గి శ్రీరాములు,నాయకులు సలిమితి బాబ్జి, సాగిన ప్రసన్నకుమార్, నామిని సలిమితి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో నేరాలకు కళ్లెం




- 23 శాతం తగ్గిన మొత్తం నేరాలు
- సైబర్ నేరాలే ప్రధాన సవాల్

**అనకాపల్లి, పెన్ పవర్, డిసెంబర్ 30 :** జిల్లా పోలీస్ శాఖ 2025 సంవత్సరానికి విడుదల చేసిన వార్షిక నేర నివేదిక జిల్లాలో శాంతిభద్రతల పరంగా గణనీయమైన మార్పును సూచిస్తోంది. మొత్తం నేరాలు 23 శాతం తగ్గడం జిల్లా పోలీస్ యంత్రాంగం తీసుకున్న వ్యూహాత్మక చర్యలకు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే, అదే సమయంలో సైబర్ నేరాల పెరుగుదల కొత్త సవాలుగా మారినట్లు నివేదిక స్పష్టం చేస్తోంది.

తగ్గిన హింసాత్మక నేరాలు.. ప్రజా భద్రతకు ఊతం..

హత్యలు, ప్రాణహానికలిగించే దాడులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వంటి తీవ్రమైన నేరాల్లో భారీగా తగ్గుదల నమోదవడం ముఖ్యమైన పరిణామం. హత్య కేసులు 35 శాతం తగ్గడం, బాడిలీ ఆఫెన్సులు 29 శాతం తగ్గడం ద్వారా జిల్లాలో ప్రజలు మరింత సురక్షిత వాతావరణాన్ని అనుభవిస్తున్నారని చెప్పవచ్చు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 54 శాతం తగ్గడం సామాజిక సమతుల్యతకు అనుకూల సంకేతంగా భావించబడుతోంది.

మహిళలు, చిన్నారుల భద్రతలో పురోగతి..

మహిళలపై నేరాలు 25 శాతం తగ్గడం పోలీస్ శాఖ మహిళా భద్రతకు ఇచ్చిన ప్రాధాన్యతను సూచిస్తోంది. కిడ్నాప్ కేసులు, వరకట్న వేధింపుల తగ్గుదలతో పాటు, మిస్సింగ్ కేసుల్లో 81 శాతం మందిని సురక్షితంగా గుర్తించడం పోలీస్ విభాగం సమర్థతకు నిదర్శనం. అయితే, పోక్సో కేసుల్లో కేవలం స్వల్ప తగ్గుదల మాత్రమే నమోదవడం మరింత అప్రమత్తత అవసరాన్ని సూచిస్తోంది.

సైబర్ నేరాలు – పెరుగుతున్న ప్రమాదం..

మొత్తం నేరాలు తగ్గుతున్నప్పటికీ, సైబర్ నేరాలు 25 శాతం పెరగడం ఆందోళన కలిగించే అంశం. సోషల్ మీడియా వేధింపులు కూడా పెరుగుతున్నాయి. ఇది డిజిటల్ అవగాహన, సైబర్ భద్రతపై ప్రజలకు మరింత శిక్షణ అవసరమని తెలియజేస్తోంది.

సాంకేతికతతో వేగవంతమైన నేర ఛేదన..

సీసీటీవీ నెట్‌వర్క్ విస్తరణ, ఏఎఫ్ఐఎస్ వినియోగం, కాల్ డేటా విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులు నేరాల ఛేదనలో కీలక పాత్ర పోషించాయి. 450 సీసీటీవీ కెమెరాల విశ్లేషణతో హత్య కేసు ఛేదించడం, 24 గంటల్లో మరో హత్య కేసులో నిందితుడిని పట్టుకోవడం పోలీస్ శాఖ సామర్థ్యాన్ని చాటుతోంది.

మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు..

గంజాయి అక్రమ రవాణాపై తీసుకున్న కఠిన చర్యలతో ఎన్డిపిఎస్ కేసులు 21 శాతం తగ్గాయి. భారీగా మాదకద్రవ్యాలు, వాహనాలు స్వాధీనం చేసుకోవడం, పిట్ ఎన్డిపిఎస్ కేసులు నమోదు చేయడం ద్వారా మాఫియాపై గట్టి దెబ్బ పడినట్లు తెలుస్తోంది. ఆస్తుల ఫ్రీజింగ్ చర్యలు కూడా భవిష్యత్తులో నిరోధక ప్రభావం చూపే అవకాశముంది.

శిక్షలు 51 శాతం – న్యాయ వ్యవస్థలో ముందడుగు..

హత్య, గంజాయి, పోక్సో కేసుల్లో 51 శాతం కన్విక్షన్ రేటు సాధించడం జిల్లా పోలీస్ శాఖ దర్యాప్తు నాణ్యతను ప్రతిబింబిస్తోంది. మరణశిక్ష, జీవిత ఖైదు వంటి శిక్షలు పడటం నేరస్తుల్లో భయాన్ని పెంచే అంశంగా పరిగణించవచ్చు. మొత్తం మీద 2025 నేర నివేదిక అనకాపల్లి జిల్లాలో నేర నియంత్రణ దిశగా స్పష్టమైన పురోగతిని చూపిస్తోంది. హింసాత్మక నేరాలు, మహిళలపై నేరాలు తగ్గడం అభినందనీయం. అయితే, సైబర్ నేరాలు మరియు ఆస్తి సంబంధిత నేరాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రజల సహకారం, సాంకేతికత వినియోగం కొనసాగితే జిల్లాను మరింత సురక్షితంగా మార్చడం సాధ్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## నూతన సంవత్సర వేడుకలపై అనకాపల్లి పోలీసుల కఠిన ఆంక్షలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు



**అనకాపల్లి, పెన్ పవర్, డిసెంబర్ 30 :** 2026 నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా, భద్రతతో నిర్వహించేందుకు అనకాపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. వేడుకల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యలనైనా సహించబోమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లావాసులందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తూనే, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలుగా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యంగా హోటళ్లు, రిసార్టులు, క్లబ్బులు మరియు బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వినోద కార్యక్రమాల్లో అశ్లీలత, నగ్న ప్రదర్శనలు లేదా సంస్కృతికి విరుద్ధమైన కార్యక్రమాలు ఉండకూడదని స్పష్టం చేశారు. అన్ని కార్యక్రమాలు ప్రభుత్వ నిర్దేశించిన సమయానికి ముగించాల్సిందేనని ఆదేశించారు.

పార్టీలు మరియు వేడుకల్లో డ్రగ్స్, నార్కోటిక్స్ లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ అంశంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయగా, నిర్వాహకులు లేదా పాల్గొనే వారు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పూర్తిగా నిషేధమని, ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యువత బైక్ రేసింగ్‌లు, కారు రేసింగ్‌లు, అతివేగం మరియు అజాగ్రత్త డ్రైవింగ్‌కు పాల్పడకూడదని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముండటంతో, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ బృందాలను (స్పెషల్ టీమ్స్) ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై సున్నా సహన విధానం అమలు చేస్తామని హెచ్చరించారు.

అగ్ని ప్రమాదాల నివారణ దృష్ట్యా బాణసంచా కాల్చడంపై నిషేధం విధించారు. అలాగే డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై పరిమితులు విధిస్తూ, శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

స్త పోలీసు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు లేదా గుంపులుగా ప్రదర్శనలు నిర్వహించకూడదని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించేందుకు కీలక ప్రాంతాల్లో అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగుతుందని, ప్రజలందరూ పోలీసులకు సహకరించి నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు.

## సంబరాలు శృతి మించితే కఠిన చర్యలు

- డి.ఎస్.పి శ్రీనివాసరావు



**నర్సీపట్నం, పెన్ పవర్ (డిసెంబర్ 30) :** నూతన సంవత్సర వేడుకలలో భాగంగా డిసెంబర్ 31 రాత్రి యువత సంబరాలు పేరుతో శృతిమించితే తాటతీస్తామని నర్సీపట్నం డియస్పి శ్రీనివాసరావు హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలు, సంబరాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆయన అన్నారు. మద్యం సేవించి వేగంగా బండి నడపటం, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ తొలగించి పెద్ద సౌండ్ తో బండి నడపడం లాంటి చర్యలు నిషేధమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం మానుకోవాలని, నాలుగు గోడల మధ్యనే సంబరాలు జరుపుకోవాలని సూచించారు. ఈవెంట్స్, డీజే లాంటివి నిర్వహించాలనుకునేవారు అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు. మద్యం షాపులకు 31 రాత్రి 12 గంటల వరకు అనుమతులు ఇచ్చినప్పటికీ, షాపులో కొనుక్కుని వెళ్లిపోవాలి తప్ప, బయట ప్రదేశాల్లో తాగరాదన్నారు. టౌన్ సిఐ గఫూర్ మరియు నలుగురు ఎస్ఐలతో సహా ఏడు బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి కూడలి లోను డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయన్నారు. ప్రధాన రహదారులలో ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తూ గుంపులుగా ఉంటే చర్యలు తప్పవని డియస్పి హెచ్చరించారు. అందరూ ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకొని, సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి సేవలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే



**పెందుర్తి, పెన్ పవర్, డిసెంబర్ 30 :** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పెందుర్తి వెంకటాద్రి కొండ మెద గల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ సతీసమేతంగా భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీవారి ఆశీస్సులు పొందారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ దర్శనం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు అన్నంరెడ్డి అదీప్ రాజ్ తెలిపారు.

ఈ పర్వదినం భక్తుల జీవితాల్లో ఆధ్యాత్మిక శక్తిని నింపుతుందని, ధర్మ మార్గంలో నడిచేలా ప్రేరణనిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి కనకరాజు, మండల పార్టీ అధ్యక్షులు గోరపల్లి శ్రీను, వార్డు అధ్యక్షులు రాపర్తి మాధవరావు, తమర్ల నర్సింగ్ రావు, మెంతి మహేష్, ఈసారపు గోవింద్, వేపాడ శ్రీను, జతిన్ యాదవ్, నూకరత్నం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్శనానంతరం ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారి ప్రసాదాన్ని స్వీకరించి, భక్తులతో సానుకూలంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలను ప్రజలకు తెలియజేశారు.ం

## వైకుంఠ ఏకాదశికి కూచిపూడి నృత్యాంజలి

- భక్తి పరవశంలో మునిగిన శృంగవరపుకోట భక్తులు



**శృంగవరపుకోట, పెన్ పవర్, డిసెంబరు 30 :** వైకుంఠ ఏకాదశి పవిత్ర సందర్భంగా శృంగవరపుకోట మండలం భర్తాపురంలో ఉన్న శ్రీ కళ్యాణ ప్రసన్న వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం కళా వైభవంతో కళకళలాడింది. ఫైన్ ఆర్ట్స్ అకాడమీ (ఫా) ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యాంజలి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

నాట్యాచార్యుడు యమ్.తాతారావు నేతృత్వంలో ఇరవై నాలుగు మంది కళాకారులు మొత్తం పన్నెండు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. శ్రీమన్నారాయణుని లీలలు, వైకుంఠ మహిమ, భక్తి భావాలను ప్రతిబింబించే అంశాలతో సాగిన ఈ నృత్యాలు ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపాయి. కళాకారుల ముద్రలు, భావాభినయాలు, లయాత్మక కదలికలు వీక్షకులను భక్తి పరవశ్యంలో మమేకం చేశాయి. ప్రదర్శనల సందర్భంగా శాస్త్రీయ సంగీతం, తాళ వాయిద్యాల సమన్వయం నృత్యాలకు మరింత శోభను చేకూర్చింది.

వైకుంఠ ఏకాదశి ప్రాధాన్యతను చాటే విధంగా రూపొందించిన నాట్యరచనలు భక్తుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించాయి.

ఈ కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు బి. రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు పాల్గొని కళాకారులను అభినందించారు. సంప్రదాయ కళలను పరిరక్షిస్తూ, యువతకు శాస్త్రీయ నృత్యాలపై ఆసక్తి పెంపొందించడమే అకాడమీ లక్ష్యమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణలో రమ్య, శ్రావణి, శాంతి, కాండ్రేగుల జయవిష్ణు, ఈశ్వరరావు సమన్వయకర్తలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ నృత్యాంజలి కార్యక్రమం ఆలయానికి వచ్చిన భక్తులకు ఒక మరపురాని ఆధ్యాత్మిక%–%సాంస్కృతిక అనుభూతిని అందించింది.

# గొలుగొండ మండలంలో సంకల్పం



**గొలుగొండ, పెన్ పవర్ (డిసెంబర్ 30) :**జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గారి ఆదేశాల మేరకు, నర్సీపట్నం సబ్ డివిజన్ డిఎస్పీ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, గొలుగొండ మండలంలోని గురుకుల పాఠశాల మరియు జూనియర్ కాలేజ్‌లో "సంకల్పం కార్యక్రమం" నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సర్కిల్ సీఐ ఎల్. రేవతమ్మ, గొలుగొండ ఎస్ఐ రామారావు మరియు పోలీసు సిబ్బంది, కాలేజ్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగంతో కలిగే ప్రమాదాలు గురించి అవగాహన కల్పిస్తూ, వాటి దుష్ప్రభావాలను వీడియోల రూపంలో చూపించి వివరించారు. యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, గంజాయి లేదా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఏదైనా తెలిసిన వెంటనే 112 లేదా 1972 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.
అదేవిధంగా "వద్దు వద్దు గంజాయి వద్దు", "సె నొ టు డ్రగ్స్" వంటి నినాదాలతో సుమారు 600 మంది విద్యార్థులు స్కూల్ నుంచి గొలుగొండ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

## విశాఖ ఉక్కు కర్మాగారం ఇన్స్ట్రుమెంటేషన్ కే. ఉదయ భాస్కర్ నాయుడు ఉద్యోగ విరమణ సందర్బంగా సత్కారం



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,డిసెంబర్ 30** విశాఖ ఉక్కు కర్మాగారం ఇన్స్ట్రుమెంటేషన్ విభాగంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కే. ఉదయ భాస్కర్యుడు ఉద్యోగ విరమణ సందర్భంగా విభాగం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్మిక నాయకులు, సహోద్యోగులు పాల్గొని, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. సంస్థలో పనిచేసిన కాలంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ఉదయ భాస్కర్ నాయుడు సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వక్తలు తెలిపారు.
కార్యక్రమంలో పుష్పగుచ్ఛాలు, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా కార్మిక ఉద్యమానికి ఆయన మార్గదర్శకత్వం కొనసాగాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ నాయకులు డి. ఆదినారాయణ, కే. సత్యనారాయణ, చీకటి శ్రీను, నాగబాబు, డిపార్ట్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ముక్కోటి ఏకాదశి



**గాజువాక:పెన్ పవర్ ,డిసెంబర్ 30** జీవీఎంసీ 65 వార్డు భోనోజి తోట గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పండుగను కన్నులవిందుగా ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో నిర్వహించారు . కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట రామయ్య, గాజువాక వైఎస్ఆర్సిపి సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి ఎమిలీ జ్వాలా దంపతులు, 67వ వార్డ్ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మొదటి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉత్తర ముఖాను వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం రెండవది అని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాల నుండి ప్రతి శనివారం అన్న సమారాధన జరిపిస్తున్నారు. అలాగే ఆలయ నిర్మాణం కోసం తమ వంతు కృషి చేస్తామని నిర్వాహకులకు తెలియజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి వేకువజామున మూడు గంటల నుండి స్వామివారి కోసం ఏర్పాటు చేసి సప్త ద్వారాలు నుండి వచ్చి భక్తులకు స్వామివారిని సుమారు 8వేల మంది తెలియజేశారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు నిర్వాహకులు తెలియజేశారు. లాభాల దుర్గాప్రసాద్ భవానిలు చే అన్నమాచార్య కీర్తనలు ఆలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ నిర్మాణం కోసం సహాయ సహకారాలు అందించిన భక్తులందరూ పాల్గొన్నారు.

# విజ్ఞాన్ దువ్వాడలో ఏఐ కోసం హై-స్పీడ్ వైర్లైన్ కమ్యూనికేషన్ అంశం పై ఐదు రోజుల సెమినార్ ప్రారంభం

**కూర్మన్నపాలెం :పెన్ పవర్ , డిసెంబర్ 30:** విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటోనమస్, దువ్వాడ, విశాఖపట్నంలో ఏఐ కోసం హై-స్పీడ్ వైర్లైన్ కమ్యూనికేషన్ అంశంపై ఐదు రోజుల సెమినార్‌ను సోమవారం, డిసెంబర్ 29, 2025న ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహిస్తుందని , జనవరి 03, 2026 వరకు కొనసాగుతుందని . ఈ సెమినార్‌కు డా. చి. రమేష్ బాబు, డీన్ – ఐక్యుఏసీ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారని తెలిపారు .
ప్రారంభోత్సవ కార్యక్రమం సంప్రదాయ దీప ప్రజ్వలనంతో ప్రారంభమై, అకడమిక్ చర్చలకు శుభారంభం పలికింది. ఈ సెమినార్‌కు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ మరియు సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్ ల నుండి, శాస్త్ర సాంకేతిక శాఖ , భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్థిక సహకారం లభించింది.
ఈ సెమినార్‌లో ప్రముఖ అకడమిషియన్లు మరియు పరిశ్రమ నిపుణులు పాల్గొని, కృత్రిమ మేధస్సు అనువర్తనాలకు కీలకమైన హై స్పీడ్ వైర్లైన్ కమ్యూనికేషన్ వ్యవస్థలలో తాజా అభివృద్ధులు, సవాళ్లు మరియు భవిష్యత్ ధోరణులపై విస్తృతంగా చర్చిస్తున్నారని కళాశాల యాజమాన్యం సమావేశం తెలిపారు ,
ఈ సెమినార్‌కు ముఖ్య అతిథులు గా హాజరుకానున్న విశిష్ట వనరుల వ్యక్తులు, డా. విజయ్ శంకర్ పసుపురెడ్డి, ప్రొఫెసర్ %d% హెడ్, ఈసీఈ విభాగం, ఐఐటీ భువనేశ్వర్, డా. బోయపాటి సుబ్రహ్మణ్యం, అనలాగ్ డిజైన్ ఇంజినీర్, సినాప్సిస్, ఐర్లాండ్, డా. అనురాగ్ సింగ్, ప్రొఫెసర్, ఈసీఈ విభాగం, ఐఐఐటీ నయా రాయ్‌పూర్, డా. ఆర్. ఎస్. అశ్విన్ కుమార్, ప్రొఫెసర్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, ఐఐటీ కాన్పూర్, డా. చక్రవర్తి భేమిసెట్టి, సీనియర్ డిజైన్ ఇంజినీర్, ఆల్టెరా, బెంగళూరు.
సెమినార్ మొదటి రోజున నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డా. ఆర్. ఎస్. అశ్విన్ కుమార్, ప్రొఫెసర్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, ఐఐటీ కాన్పూర్, మరియు డా. బోయపాటి సుబ్రహ్మణ్యం, అనలాగ్ డిజైన్ ఇంజినీర్, సినాప్సిస్, ఐర్లాండ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా
ఈ సందర్భంగా డా. ఆర్. ఎస్. అశ్విన్ కుమార్, ప్రొఫెసర్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, ఐఐటీ కాన్పూర్, "బేసిక్ అనలాగ్ ఐసీ డిజైన్" మరియు "సిగ్మా – డెల్టా మాడ్యులేటర్ ఆర్కిటెక్చర్" అంశాలపై అవగాహనాత్మక ఉపన్యాసం అందించి, పాల్గొన్న వారికి ప్రాథమిక భావనలు మరియు ఆధునిక డిజైన్ సాంకేతికతలపై లోతైన జ్ఞానం అందించారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూధన రావు, ఈసీఈ విభాగాధిపతులు డా. ఆర్. ఉమా మహేశ్వరి మరియు డా. పి. సంతోష్, ఇతర అధ్యాపకులతో కలిసి, డా. ఆర్. ఎస్. అశ్విన్ కుమార్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.




# నేటి నుండి సిఐటియు అఖిలభారత మహాసభలు



- డిసెంబరు 31 నుండి జనవరి 4వ తేదీ వరకు
- 4 తేదీన విశాఖ లో లక్షలాదిమందితో బహిరంగ సభ
- సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్.

**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 29:–**చింతపల్లి మండల కేంద్రంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం కై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు,
కార్మికులు కార్పొరేట్ శక్తుల మధ్య జరిగే పోరాటంలో కార్మికులదే నైతిక విజయం అని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులుబోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలకు విశాఖ వేదిక కానుందని దేశ నలుమూలల నుంచి కాకలు తీరిన కార్మిక పోరాట నాయకులు అన్ని రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ 2000 మంది హాజరుకానున్నారని వీరితోపాటు ఇతర 6 దేశాల నుంచి ప్రతినిధులు రానున్నారని అన్నారు. ఇప్పటికే రోజు ఐదు గంటల నుంచి 9 గంటల వరకు వివిధ రూపాల్లో శ్రామిక ఉత్సవ పేరుతో సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శనలు జరుగుతున్నాయని ప్రముఖ సినీ నటులు రచయితలు కళాకారులు, హాజరై ప్రారంభ ఉత్సవాలు చేస్తున్నారని, ప్రకాష్ రాజ్, గోరటి వెంకన్న, సుద్దాల అశోక తేజ, గాయని మంగ్లీ ఈ సాంస్కృతిక ఉత్సవాలకు పాల్గొనటానికి విశాఖ వస్తున్నారని ఈ సందర్భంగా వచ్చిన వారందరూ మాట్లాడుతూ తాత్కాలికంగా ఓటమి అయినప్పటికీ దీర్ఘకాలంలో కార్మికుల పై చేయి అవుతుందని కార్మిక రాజ్యంలోనే ఈ దేశం అభివృద్ధి చెందుతుందని, దోపిడీ లేని సమాజం ఏర్పడుతుందని వివరించారని అన్నారు. కూలి యజమాని, కార్మికుడు కంపెనీ యజమాని తేడా లేకుండా అంత సమానత్వం కోసం కార్మిక వర్గం ముందు బాగాన నిలబడి ఆ రాజ్యం కోసం పోరాటం చేయవలసి వస్తుందని కొనియాడారు, నాలుగున విశాఖ నగరంలో జరిగే లక్షలాదిమంది బహిరంగ సభలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్, మోరి వెంకటగిరి, పాంగి ధనుంజయ్, వంతల నాగేశ్వరరావు, సాగిన చిరంజీవి పడాల్ పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం,సంక్రాతి సంబరాలలో కట్టుదిట్టమైన పోలీస్ నిఘా..!

**కోడిపందాలు,పేకాటలు ఆడితే కఠిన చర్యలు తప్పవు..**
**సీలేరు ఎస్ఐ ఎండి.యాసిన్ హెచ్చరిక.**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,డిసెంబర్ 30**: రానున్న నూతన సంవత్సరం, సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీలేరు ఎస్ఐ ఎండి.యాసిన్ సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం,సంక్రాతి పండుగల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేసామని,అలాగే భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్ఐ అన్నారు. సంబరాలను పురస్కరించుకొని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబరాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాల వినియోగం, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేసారు. ఇదే క్రమంలో కోడి పందాలు, పేకాటలు వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తూ పోలీసులకు చెప్పామని చెబుతూ అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని, దాడులు నిర్వహించి కేసులు కడతామని ఈ సందర్భంగా ఎస్సై యాసీన్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

## చింతపల్లిలో ఉత్తర ద్వార దర్శనం లక్ష తులసి చామంతులతో పూజలు



**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 30 :–**చింతపల్లి మండల కేంద్రం అంతర్ల గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరి సమేత అనాధేశ్వర స్వామి ఆలయంలో శివానంద మాతాజీ ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్ష తులసి చామంతులతో అష్ట లక్ష్మణులకు సీతారామచంద్రమూర్తికి రాజరాజేశ్వరి అమ్మవారికి భక్తులతో పూజలు చేయించారు మంగళవారం ఉదయం నుండి బుధవారం ఉదయం ఐదు గంటల వరకు భజన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు చింతపల్లి రామాలయంలో ఆలయ ధర్మకర్త మాదాబత్తుల సత్తిబాబు ఆధ్వర్యంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు మొదట ధర్మకర్త కుటుంబీకుల దర్శనం చేసుకున్నారు గ్రామంలో అధిక సంఖ్యలో భక్తులు శ్రీరామచంద్రుని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు

## పనసపల్లిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు-పాల్గొన్న జనసేన నేతలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, డిసెంబర్ 30:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం పనసపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్‌తో పాటు పార్టీ నాయకులు గడుతూరి పరమేశ్వర రావు, పాంగి చంటిబాబు పాల్గొన్నారు. అలాగే సంఘ పెద్దలు ఇమ్మానియేల్,ప్రసాద్, బాలకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామంలో సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

## హరి నామస్మరణతో ఆలయాలకు పోటెత్తిన భక్తజనం



**నర్సీపట్నం, పెన్ పవర్ (డిసెంబర్ 30 ) :**వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని హరినామస్మరణతో నర్సీపట్నంలోని వైష్ణవాలయాలన్నీ కిటకిటలాడాయి. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో, ఉత్తరవాహినీ నదీతీరంలో వేంచేసి ఉన్న శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో, బయపురెడ్డి అప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో కొత్త బయపురెడ్డిపాలెం బ్రిడ్జికి ఆనుకొని ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలోనూ వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తబయపురెడ్డిపాలెం వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వెండి ఆభరణాలతో, తులసి మాలల అలంకరణతో నేత్రపర్వంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకరణతో ఆలయం ఎంతో ఆకర్షణీయంగా మారింది. స్వామి వారి వైభవం చూసేందుకు భక్తులు తండోపతండాలుగా విచ్చేశారు. ఉత్తరవాహిని నదీతీరంలోని శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని పల్లకి సేవను నిర్వహించారు. ఆలయకమిటీ చైర్మన్ శెట్టి బ్రహ్మ లింగస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శయనరూపంలోనున్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుండే బారులు తీరారు. నర్సీపట్నం వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారు చందన అలంకృతుడై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హరినామస్మరణతో నర్సీపట్నం ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో పులకించిపోయింది.

# దారకొండలో వైకుంఠ ఏకాదశి సందర్బంగా మేల్కొలుపు,శ్రీరాముని పల్లకి ఊరేగింపు..

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,డిసెంబర్ 30:**జీకే వీధి మండలం దారకొండ గ్రామంలో మంగళవారం ఉదయం సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ కొర్రా.రాము ఆధ్వర్యంలో వేకువ జామున మేల్కొలుపు,సాయంత్రం శ్రీరాముని పల్లకి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పురవీధులలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి హరినామ స్మరణతో మేల్కొలుపు,శ్రీరాముని పల్లకి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సద్గురు వర్యులు గొర్లె.రామయ్య స్వామి గురుమాత గౌరగలి.లక్ష్మి గుడి సేవకులు పి.బాబురావు,మడిగుంట లక్ష్మీనారాయణ సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ గొర్లె.గణేశ్వరరాజు,గొర్లె బరసయ్య,డిడి,సుధ,భవాని విజయలక్ష్మి,పద్మ,అనంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## చిన్న వెంకన్న సేవలో వైసీపీ నాయకులు



**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 30.**వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ద్వారకా తిరుమలలో కొలువైయున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి ఆలయంలో ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో నాయకులకు స్వాగతం పలికారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ తానేటి వనిత, తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లు బోయిన వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

◆ ఎమ్మెల్యే మద్దిపాటి

**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 30.**
నియోజకవర్గంలోని ప్రజానీకం సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు కోరారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వేళ్ళ చింతల గూడెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దిపాటి, మధు రంగ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఘంటా మధు కృష్ణ తదితరులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వీరికి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వీరు పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం దినదిన అభివృద్ధి చెందాలని ప్రజలు సుఖంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## నూతన సంవత్సరం వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలి

◆ ఎస్సై మోహన్ కుమార్

**కాజులూరు, పెన్ పవర్ డిసెంబర్ 30:**కాజులూరు మండల ప్రజలందరికీ గొల్లపాలెం పోలీస్ నూతన సంవత్సరం 2026 శుభాకాంక్షలు తెలిపారు. రానున్న నూతన సంవత్సరాన్ని ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని కోరుతూ, శాంతిభద్రతలు మరియు ప్రజల భద్రత దృష్ట్యా గొల్ల పాలెం ఎస్సై ఎం.మోహన్ కుమార్ పలు సూచనలు జారీ చేశారు.పోలీస్ అధికారులు మాట్లాడుతూ రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్, అతివేగంగా వాహనాలు నడపడం, బైక్ రేసింగ్‌లకు పాల్పడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.మద్యం సేవించి వాహనాలునడపకూడదని, డిసెంబర్ 31 రాత్రి మండలం అంతటా విస్తృత తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాల జప్తు సహా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అదేవిధంగా 31వ తేదీ రాత్రి అనవసరంగా రోడ్లపై తిరగకుండా, వీలైనంత వరకు వేడుకలను ఇళ్లలోనే జరుపు కోవాలని సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈవెంట్లు లేదా పార్టీలను నిర్వహించాలను కునే వారు పోలీస్ స్టేషన్ నుండి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరిగా పేర్కొన్నారు. అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లేదా కాలనీల్లో డీజేలు ఏర్పాటు చేయడం నిషేధమని, ధ్వని కాలుష్య నియమాలను ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్స్‌ను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం, సరఫరా చేస్తే కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు.మీ సంతోషం మీకే కాకుండా మీ కుటుంబానికి, ఇతరులకు కూడా భద్రతగా ఉండేలా బాధ్యతాయుతమైన పౌరులుగా పోలీసులకు సహకరించాలని గొల్లపాలెం ఎస్సై కోరారు.

## వైఎస్ఆర్సిపి తూర్పు నియోజకవర్గ సర్వసభ్య సమావేశం

తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు అధ్యక్షతన



**విశాఖ తూర్పు,పెన్ పవర్, డిసెంబర్ 30:** వైయస్సార్సీపి తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో,సమన్వయకర్త మొల్లి అప్పారావు. ఆధ్వర్యంలో వార్డు కార్పొరేటర్లు,ఇంచార్జిలు,అధ్యక్షులతో అత్యవసర సమావేశం నిర్వహించారు,నియోజకవర్గంలో వార్డు కమిటీ,అనుబంధ విభాగాల అధ్యక్షులు మరియు వారి అనుసంధానంగా 8 మంది సభ్యులతో కూడిన కమిటీలు జనవరి 23 లోపు ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా పార్టీకి క్రమశిక్షణ గల కార్యకర్తలను మాత్రమే,ఈ కమిటీలలో నియమించుకోవాలన్నది మీటింగ్ సారాంశం అని సమన్వయకర్త తెలిపారు. మీరందరూ దీనిపై ప్రత్యేకమైన వైసిపి యొక్కప్రత్యేకమైన గుర్తింపు కార్డును వారికి అందజేసి,వారికి రానున్న రోజుల్లో,ప్రత్యేకమైన గౌరవం రాష్ట్ర నాయకత్వం కలగజేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్,జిల్లా అధికార ప్రతినిధి,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పల్లా దుర్గారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి,9 వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకట స్వాతి దాసు,12 వ వార్డు కార్పొరేటర్ రోహిణి, వార్డు అధ్యక్షులు పీతల గోవింద్,నీరజ్ కుమార్, పతివాడ కనకరాజు,మొల్లి హేమంత్,సత్యాల వెంకట్, కణితి మరియదాసు,చొల్లంగి నాగేశ్వరరావు,పలికిల నీలారెడ్డి,ఉమ్మిడి కళ్యాణ్, యనమరెడ్డి కుమార్ రెడ్డి,మధుపాడ రవి,బూస రమణరెడ్డి,రాపాక శ్రీనివాస్, సీనియర్ నాయకులు బెవర జగదీష్,పతివాడ వెంకటలక్ష్మి, సూరాడ వెంకటలక్ష్మి,పులగం సూర్యనారాయణ రెడ్డి,వర్జి వెంకటలక్ష్మి,గొలగాని త్రినాథ్, మాదు మంగరాజు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కైలాసగిరి అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ




◆ పర్యాటకుల రద్దీ నియంత్రణ, భద్రత, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, డిసెంబర్ 30 :**
ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కైలాసగిరికి ఇటీవలి కాలంలో పర్యాటకుల రద్దీ గణనీయం గా పెరుగుతున్న నేపథ్యంలో, భద్రతా చర్యలు, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, అదనపు పార్కింగ్ సదుపాయాలు, అలాగే భవిష్యత్తు అభివృద్ధి పనులపై సమగ్రంగా పరిశీలించేం దుకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఐఏఎస్ ఆధ్వర్యంలో కైలాసగిరి అభివృద్ధి కమి టీ ప్రత్యేకంగా క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టింది.
ఈ పర్యటనలో విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం భరత్, విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వి ఎం అర్ డి ఎ ఛైర్పర్సన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, ప్రత్యేక ఆహ్వానితులుగా, వి ఎం అర్ డి ఎ మెట్రోపా లిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్, ఐఏఎస్ పాల్గొన్నారు.క్షేత్ర పర్యటన అనంతరం , వి ఎం అర్ డి ఎ సమావేశ మందిరంలో నిర్వహించిన కైలాసగిరి అభివృద్ధి కమిటీ తొలి సమావేశంలో చేపట్టవలసిన కీలక అంశాలపై సభ్యులు విస్తృ తంగా చర్చించారు. పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, రద్దీ నియంత్రణ కు తక్షణ చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమ స్యల నివారణకు సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. అదేవిధంగా అదనపు పార్కింగ్‌కు అనువైన స్థలాలను గుర్తిం చి అభివృద్ధి చేయాలన్న అంశంపై కూడా స్పష్ట మైన దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా ఎంపీ ఎం. భరత్ మాట్లాడు తూ, నిపుణులైన ఇంజనీర్లతో సమగ్ర అధ్యయ నం చేసిన అనంతరం పర్యావరణ వ్యవస్థకు హాని కలగకుండా, రాబోయే రెండేళ్ల కాలానికి తాత్కాలికంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలన్నారు.
తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కైలాసగిరి పరిసరాల్లో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పా టు అవసరమని పేర్కొన్నారు., వి ఎం అర్ డి ఎ ఛైర్పర్సన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, మెడికల్ ఎయిడ్ సెంటర్, అగ్నిమాపక నియం త్రణ పరికరాల ఏర్పాటు తప్పనిసరి అని సూచించారు.
ఈ సమావేశంలో , వి ఎం అర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్, ఐఏఎస్, జాయింట్ కమిషనర్ రమేష్, భీమిలి ఆర్డీఓ సంగీత్ మాథుర్, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్టేట్ అధికారి దయానిధి, అదనపు పోలీస్ కమిషనర్ నరసింహమూర్తి, జి వి ఎం సి అదనపు కమిష నర్ వర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

## స్థానికుల అభిప్రాయాల తర్వాతే రుషికొండ భవనాలపై తుది నిర్ణయం



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**బిమిలి, పెన్ పవర్, డిసెంబర్ 30 :**రుషికొండ భవనాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత వర్గాల అభిప్రాయాలు సేకరించిన అనంతరమే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని తెలిపారు. మం గళవారం ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు.రుషికొండలో నిర్మించిన భవనాలను మ్యూజియం, ఆధ్యాత్మి క కేంద్రం, రిసార్ట్స్ తదితర ప్రయోజనాలకు వినియోగించాలని పలు సంస్థలు ప్రతిపాదనలు చేసినట్లు గంటా తెలిపారు. అయితే ఏడాదిన్నర కాలంగా సరైన నిర్వహణ లేకపోవడం వల్ల భవనాలు పాడైపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్కొన్నట్టుగానే, స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే రుషికొండ భవనాలపై ప్రభుత్వ తుది నిర్ణయం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.
సింహాచలం దేవస్థానానికి సంబంధించిన ప్రసా దంలో నత్త ఉందంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసిన ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటుందని గంటా హెచ్చరించారు. విచారణలో ఆరోపణలకు ఆధారాలు లేనట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై పోలీసు చర్యలు తప్పవని అన్నారు. ప్రసాదాల కౌంటర్ సిబ్బం దిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించడం సరైనది కాదని ఆయన వ్యాఖ్యానించారు.
అటవీ శాఖతో ముడిపడి ఉన్న అడవివరం కాలభైరవ స్వామి ఆలయ రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని గంటా భరోసా ఇచ్చారు. విశాఖ వ్యాలీ రోడ్డుకు అటవీ శాఖ అభ్యంతరాలు ఉన్నప్పటికీ 201419 మధ్య కాలంలో నిర్మాణం పూర్తి చేశామని గుర్తు చే శారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ కూడా సహకరించాలని సూచిం చారు.ఈ సందర్భంగా వైసీపీపై గంటా తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీలో కొనసాగుతున్న వారికి రాజకీయంగా భవిష్యత్ లేదని వ్యాఖ్యా నించారు. ప్రభుత్వం చేపడుతున్న మంచి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వకపోయినా, దు ష్ప్రచారంతో అడ్డుపడటం సరికాదన్నారు. మారణాయుధాలతో హంగామా చేయడం, రక్తాభిషేకాలు వంటి చర్యలు ప్రజల్లో భయాందో ళనలు కలిగించడమేనని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేసిందని తెలిపారు.అమరావతిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి స్మశానంలా మార్చిందని ఆరోపించిన గంటా, ప్రస్తుతం యుద్ధ ప్రాతిపదిక న నిర్మాణాలు చేపట్టి ఆంధ్రులు గర్వించే రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.
పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ ఫస్ట్ ఛాయిస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో పరిశ్రమ లు పెట్టడానికి ఆసక్తి చూపని పారిశ్రామికవేత్త లు, ఇప్పుడు గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలను కాదని ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని గంటా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డి సమర్థ నాయకత్వంపై ఉన్న నమ్మకమే ఇందుకు కారణమని తెలిపారు. 164 సీట్లతో కూటమిని గెలిపించిన ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రాన్ని అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెడతామని చెప్పారు. ఎన్నికల్లో జరిగిన స్వల్ప తప్పిదాల వల్లే వైసీపీకి 11 సీట్లు దక్కాయని, లేదంటే సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యేదని వ్యాఖ్యానించారు.
ఈ సమావేశంలో కార్పొరేటర్లు పి.వి. నరసిం హం, లొడగల అప్పారావు, కూటమి నేతలు చిక్కాల విజయ్‌బాబు, గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, ఎర్ర రాజు, వాండ్రాసి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువతి యువకులకు అవకాశం

**చింతపల్లి పెన్ పవర్ డిసెంబర్ 30:-**
పాడేరు ఐటిడిఏ పరిధి లో ఉన్న లంబసింగి జంక్షన్ చింతపల్లి మండలంలో ఉన్న గెస్ట్ హౌస్ నిర్వహణ కొరకు స్థానిక గిరిజన యువతి యువకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాడేరు ఐటిడిఏ అధికారి తిరుమణి శ్రీ పూజ ప్రకటనలో తెలిపారు నియమ నిబంధనలు చింతపల్లి మండలంలో గల గిరిజన యువతి యువకులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తుదారుడు తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణతై 21సంవత్సరాలు వయసు ఉండవలెను రెండు సంవత్సరాలు కాల పరిమితి నిర్వహణ కొరకు దరఖాస్తు ఆహ్వానం పలుకుతున్నాము టెండర్ ప్రక్రియ ద్వారా ఎక్కువ అద్దె చెల్లించే వారిని ఎంపిక చేయడం జరుగుతుంది నిర్వహణ కొరకు స్థానిక గిరిజన యువతి యువకులతో మాత్రమే నిర్వహణ చేయవలెను నిర్వహణకాలంలో గెస్ట్ హౌస్ పరిసరాల ప్రాంతమంతా పరిశ్రమలతో ఉండాలి ఎంపిక కాబడిన వారు నిర్వహణ కొరకు పూర్తిగా పెట్టుబడి పెట్టుకోవాల్సి ఉంటుంది గెస్ట్ హౌస్ ను స్వాధీనం చేసుకునే ముందు మొదటి సంవత్సరము అద్దె సొమ్ము మొత్తం చెల్లించాలి అలాగే రెండవ సంవత్సరం యొక్క అద్దె సంవత్సరం మొదటి వారంలో చెల్లించాలి దరఖాస్తు స్వీకరణ 2జనవరి 2026, నుండి 9 జనవరి వరకు పాడేరు ఐటిడిఏ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలి ఎంపిక కొరకు 19 జనవరి 19 ఎంపిక చేయడం జరుగుతుంది ఒక దరఖాస్తు మాత్రమే పెట్టవలెను ఈ అవకాశం చింతపల్లి మండలం గల గిరిజన యువతీ యువకులకు వినియోగించుకోగలరని పాడేరు ఐటిడిఏ పీవో తెలిపారు

## న్యాయ సంరక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన.. ఎస్సై డి. రామ్ కూమార్

**సీతానగరం, పెన్ పవర్, డిసెంబర్ 30:**విద్యార్థులు కేవలం జ్ఞానం, విజ్ఞానం కోసమే నిరంతరం శ్రమించాలని, లేనిపోని వ్యసనాలతో, తప్పుడు మార్గంలో ప్రయాణిస్తూ జీవితాలను నాశనం చేసుకోవద్దని సీతానగరం ఎస్సై డి. రామ్ కూమార్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు న్యాయ సంరక్షణ చట్టాలపై డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై డి. రామ్ కుమార్ మాట్లాడుతూ తప్పు చేశాక, తెలియక చేశాం, వదిలేయండి అంటే అవ్వదని తప్పుకు తగ్గ శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంరక్షణ చట్టాల పైన, వ్యసనాలకు బానిసైతే జరిగే పరిణామాల పైన, అమ్మాయిల పైన చెడుగా ప్రవర్తిస్తే వచ్చే శిక్షల పైన అవగాహన తప్పనిసరి ఉండాలని అనంతరం పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై, అమ్మాయిలపై తప్పుగా ప్రవర్తిస్తే, పడేటటు వంటి శిక్షలపై అవగాహన కల్పించారు. తప్పు చేస్తే చట్టం నుండి తప్పించుకునే పరిస్థితి లేదని తెలిపారు. మహిళపై దాడులు, లైంగిక వేధింపులు, పోక్సో చట్టంపై విద్యా ర్థులకు వివరించారు. డిసెంబర్ 31 రాత్రి విద్యార్థులు బైక్ రేసులు మద్యం సేవించి వాహనాలు నడిపితే అవసరమైన గొడవలు వెళ్లి పోలీస్ కేసుల్లో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.



## కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊపిరి

◆ పెట్టుబడులు, ఉద్యోగాలు, సంక్షేమం, మౌలిక వసతుల్లో వేగం
◆ వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, డిసెంబర్ 30 :**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన త ర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో దృఢంగా ముందుకు సాగుతోందని వీఎంఆర్డీఏ చైర్మన్ శ్రీ ఎం.వి. ప్రణవ్ గోపాల్ స్పష్టం చేశారు. గత ఏడాది కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంతర కృషితో రాష్ట్రంలో అభివృద్ధి వేగం పెరిగిందని తెలిపారు. ముఖ్య మంత్రి ఆదేశాలతో విశాఖపట్నాన్ని పర్యాటక, ఐటీ, పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొ న్నారు. ఐటీ మంత్రి నారా లోకేష్ నాయకత్వం లో విశాఖ ఐటీ హబ్‌గా రూపుదిద్దుకుంటోందని, ఇప్పటికే గూగుల్‌రిలయన్స్ డేటా సెంటర్, టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, కాగ్నిజెంట్‌కు శంకుస్థాపన జరిగిందన్నారు. ఈ పెట్టుబడుల వల్ల పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు.

ఉపాధి, ఉద్యోగాలపై ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.

సంక్షేమ పథకాల్లో కొత్త దిశ

ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందాయని ప్రణవ్ గోపాల్ తెలిపారు. 'తల్లికి వందనం' పథకం కింద రూ.10,090 కోట్లను వెచ్చించామ ని, 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పా రు. అలాగే ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పెన్షన్ల కోసం రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

రైతులు పేదల సంక్షేమమే లక్ష్యం

'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లను జమ చేశా మని తెలిపారు. 'దీపం2' పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేపట్టామని, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులు, నేతన్నలకు ప్రత్యేక సాయాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు.

పెట్టుబడులు ఆర్థిక వృద్ధి

సీఐఐ సమ్మిట్‌లో రాష్ట్రానికి రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షలకుపైగా ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 11.28 శాతం నమోదు చేసి డబుల్ డిజిట్ గ్రోత్ సాధించిందని అన్నారు.

మౌలిక వసతులు, భద్రత, పాలన

రోడ్లు, రహదారుల నిర్మాణానికి వేల కోట్ల రూపా యలు వెచ్చిస్తున్నామని, పోలవరం, వెలిగొండ వంటి కీలక ప్రాజెక్టుల్లో వేగం పెరిగింద న్నారు. 'అమరజీవి జలధార' ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అదేవిధంగా రాష్ట్రంలో క్రైమ్ రేట్ గణనీయంగా తగ్గిందని, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. వాట్సప్ గవర్నెన్స్, డేటా డ్రివెన్ పాలనతో ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తున్నామని వెల్లడించారు.
మొత్తంగా కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధినే లక్ష్యంగా ముందుకు సాగుతోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ స్పష్టం చేశారు.

# ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన పెంచుకోవాలి.



మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి

**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 30:** ఎరువుల యాజమాన్యం పై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగం సుధామోదిరి పిలుపునిచ్చారు.మంగళవారం కిర్లంపూడి మండలం సోమరాయుని పేట గ్రామంలో దాల్వా సాగు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుధామాధురి మాట్లాడుతూ ప్రస్తుతం దాల్వా సీజన్ ప్రారంభం కానున్నందున దమ్ములో వేయవలసిన ఎరువులు గురించి,రైతులు వేయవలసిన పంట రకముల గురించి వివరించారు.ఈ సందర్భంగా వ్యవసాయశాఖ రాయితీపై అందిస్తున్న జీవరసాయన ఎరువులు గురించి కూడా రైతులకు విపులంగా వివరించారు. ప్రస్తుతం దాల్వా సీజన్ కు యూరియా రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉందని,అర్హులైన ప్రతి రైతుకు కూడా యూరియా కార్డుల ద్వారా యూరియా అందించడం జరుగుతుందని రైతులకు భరోసా ఇచ్చారు.ప్రతి రైతు పంట నమోదు విధిగా చేయించుకోవాలని సూచించారు. కోతల అనంతరం వ్యర్థ పదార్థాలను ఎవరు కాల్చరాదని కాల్చడం వల్ల కలిగే నష్టాలు గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు,వీఏ విజయరాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజల అందరిపైనా ఉండాలి.

* ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 30:** శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయానికి వచ్చిన మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతి,ముద్రగడ గిరిబాబులకు ఆలయ కమిటీ సభ్యులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పర్వదినాన పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడం స్వామివారిని దర్శించుకోవడం చూస్తుంటే రోజురోజుకు ప్రజల్లో భక్తి భావం పెరగడం శుభపరిణామన్నారు. ఆ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరి పైనా ఉండాలని మనసారా కోరుకుంటున్నానన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్న కమిటీ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.ఆయన వెంట జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ముద్రగడ అభిమానులు పాల్గొన్నారు.

## ఎస్.సి, ఎస్.టి, బిసి సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి విరాళాలు అందించాలి

* జిల్లా కలెక్టర్ షణ్మోహన్ విజ్ఞప్తి

**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 30:**

కాకినాడ జిల్లాలోని ఎస్.సి, ఎస్.టి, బిసి సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమానికి దాతలు, వితరణశీలురు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక వేత్తలు, అధికారులు, ప్రజలు ఉదారంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో నిర్వహిస్తున్న సుమారు 100 సంక్షేమ హాస్టళ్లలో దాదాపు 15 వేల మంది పేద వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ విద్యార్థులకు మెరుగైన విద్య, ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్ అందించాలనే లక్ష్యంతో హాస్టళ్లలో కనీస వసతుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సదాశయ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయంగా భూరి విరాళాలు అందించి ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరుకు శుభాకాంక్షలు తెలియజేసే వారు విరాళాలను ధన రూపంలో గానీ, దోమ తెరలు, ఆర్ఓ ప్లాంటులు, లైట్లు, ఫ్యాన్లు, మోడ్రన్ లైబ్రరీ వంటి వస్తు రూపంలో గానీ అందజేయవచ్చని తెలిపారు.విరాళాలను జిల్లా కలెక్టర్, కాకినాడ వారి యుపిఐ ఐడి: 79296001ఏ%బఎఅఅ% కు %ఖూ× ×ణ/ు= జశీఎవ% ద్వారా గానీ, లేదా %ణఅరీఅష్ జశీశ్రీశ్రీవష్శీతీ ఖఖణ (ూాఎఎశీబత్ చీఖఎవ), 1440120110000923 (ూాఎఎశీబత్ చీబఎఎవతీ), ఖదీ×చీ0814407 (×ఖీూజ జశీఎవ), ఖఅఅశీఅ దీఖఅఎ శీట ×అఎఖ, జశీశ్రీశ్రీవష్శీతీఖ్వ దీతీఖఅష్ష% అకౌంటుకు నగదు బదిలీ, చెక్కు లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా చెల్లించాలని కోరారు.

పేద విద్యార్థుల జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దే ఈ ఉదాత్త కార్యక్రమంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తన ప్రకటనలో పిలుపునిచ్చారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా మైక్రోఫెస్ట్



* సూక్ష్మజీవ శాస్త్రంలో మరిన్ని పరిశోధనలు జరగాలి : అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు

**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 30 :**ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల సూక్ష్మజీవ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మైక్రోఫెస్ట్ – 2025 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలిపారు.

లూయీ పాశ్చర్ జయంతిని పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు సూక్ష్మజీవ పరిశోధన అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు, వ్యాస రచన, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ వంటి వివిధ పోటీలను నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందించిన అనంతరం డాక్టర్ నాయుడు మాట్లాడుతూ నేటి వైద్య రంగంలో సూక్ష్మజీవ శాస్త్రం ప్రాధాన్యత ఎంతో కీలకమని, విద్యార్థులు పరిశోధనా దృక్పథంతో విద్యను అభ్యసించాలని సూచించారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందుగానే వ్యాక్సినేషన్ ద్వారా వ్యాధులను నివారించడమే ఉత్తమ మార్గమని అన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సూక్ష్మజీవ శాస్త్ర విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు వి. అనిల్, డి. మాధవి రత్నప్రియ, సుభాషిణి తదితరులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభువైన ఏసుక్రీస్తు దీవెనలు ప్రజలందరిపై ఉండాలి



గ్రేస్ గాస్పల్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ సొసైటీ అధినేత, పాస్టర్ ,రెవరెండ్ టాటా విక్టర్ పెనుమాక

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 30:**ప్రభువైన ఏసుక్రీస్తు దీవెనలు, శాంతి, సమాధానాలు కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని గ్రేస్ గాస్పల్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ సొసైటీ అధినేత, పాస్టర్ ,రెవరెండ్ టాటా విక్టర్ పెనుమాక దీవించారు. క్రిస్మస్ మాసోత్సవం సందర్భంగా రూరల్ మండలం రాజవోలు గ్రామంలో క్రీస్తు కృప సంఘం ఆవరణలో సంఘ పెద్దలు, క్రైస్తవ జనుల మధ్య ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా తాపేశ్వరం కు చెందిన బిషప్ డాక్టర్ జే.డేనియల్ పాల్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. స్తుతి ఆరాధన, క్యాండిల్ లైట్ ఆరాధనలతో పాటు, క్రీస్తు జన్మదిన విశేషాలతో స్కిట్ ప్రదర్శన, నృత్యాలు ప్రదర్శించిన బాల బాలికలకు ముఖ్య అతిథులు బహుమతి ప్రధానం చేశారు. ఈ వేడుకల్లో కృపా,వంశీ క్రిస్మస్ బ్యాండ్ ఆహుతులను అలరించింది. అనంతరం మినిస్ట్రీస్ అధినేత టాటా పెనుమాక మాట్లాడుతూ, 2003 నుండి చర్చ్ నిర్మాణం చేసి క్రీస్తు పరిచర్య చేస్తున్నానని, సంఘ పెద్దలు, సంఘ సభ్యుల సహకారాలతో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం పేదలకు వస్త్ర , అన్నదానాలు చేస్తామని, పేద పాస్టర్ల ను సత్కరిస్తామని, ఆర్థిక సహాయం చేస్తున్నామని టాటా విక్టర్ తెలిపారు. క్రీస్తు పరిచర్యలో తన కుటుంబ సభ్యులతో కలిసి చేస్తున్నామని అన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభువు పరిచర్యను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని ఉద్దేశంతో గత 29 సంవత్సరాలుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. వృద్ధులు, వితంతువులకు, పేదలకు చీరలు ,దుప్పట్లు నూతన వస్త్రాలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ముఖ్యఅతిథి డానియల్ పాల్ క్రిస్మస్ సందేశనిస్తూ పాపులైన మానవాళి కోసం మనుష్య రూపంలో దిగివచ్చిన దేవుని కుమారుడు ఏసుక్రీస్తు శిలువపై మరణించి మానవాళిని రక్షించారన్నారు. క్రీస్తు జన్మదినాన్నీ యుగాంతం వరకు జరుపుకుంటామని క్రీస్తు మరణం జయించిన సజీవుడన్నారు.

## ఆర్థిక నేరాల పై సిఐడి అధికారులకు సిబ్బందికి చట్టాలపై అవగాహన

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 30:** ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వైట్ కాలర్ నేరాలు, ఆర్థిక నేరాలు గురించి సిఐడి రీజినల్ ఆఫీస్ స్థానిక సిఐడి డీజీపీ డాక్టర్ ఎ రవిశంకర్ ఆదేశాల మేరకు రాజమండ్రి సి ఇప్రాంతీయ అధికారి అస్మా ఫర్హీన్ పర్యవేక్షణలో సిఐడి అధికారులకు సిబ్బందికి చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చినారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ వి గోపాలకృష్ణ మాట్లాడుతూ చిట్ ఫండ్స్, ఎం ఏ ఎం కోపరేటివ్ సొసైటీ సంస్థలలో ఆర్థిక నేరాలలో పాల్పడే కంపెనీలపై బాధితులకు న్యాయం జరగడానికి దర్యాప్తులో ఎలాంటి మెలికలు పాటించాలి నేరస్తుల ఆస్తులు ఎలా అటాచ్ చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ పి పి కె రాధాకృష్ణ రాజు మాట్లాడుతూ, ఆస్తుల వేలంపై దర్యాప్తు అధికారి బాధితులకు సత్వర నాయం కోసం కోర్టులో పాటించవలసిన మెలకువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నామ సూర్యనారాయణ అడిషనల్ పి పి అయిదవ కోర్టు, రాజమండ్రి, శ్రీ కనక లింగేశ్వరరావు అడిషనల్, ఫ్యామిలీ కోర్టు రాచపల్లి ప్రసాద్, పి పి పి డి జె కోర్టు, రాజమండ్రి, సిఐడి ఇన్స్పెక్టర్ సిబ్బంది పాల్గొన్నారు...

## చిల్లంగి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు.

-స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రముఖ పారిశ్రామికవేత్త సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ.



**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 30:**కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేలాది మందులు భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆధ్యాత్మికపరుడు సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైనా ఉండాలని కోరారు. ఆలయానికి వచ్చిన సంపర సుధాకర శ్రీ వినాయక వర్మకు ఆలయ కమిటీ సభ్యులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయంలో సుమారు 40 లక్షల రూపాయలతో అన్నదాన సత్రం నిర్మిస్తున్న సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో

వేధపండితులు సుప్రభాత సేవతో ప్రారంభించి విశేష పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలి రావడంతో భక్తలతో ఆలయం కిటకిలాడింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## ర్యాలిలో ముక్కోటి ఏకాదశి వైభవం.. వైకుంఠ ద్వార దర్శనంతో భక్తుల వెల్లువ



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 30:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ జగన్మోహిని కేశవ %ఽ% గోపాల స్వామి వారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర (వైకుంఠ) ద్వార దర్శనాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

తెల్లవారుఝామున ఉదయం 3 గంటల నుంచే స్వామివారికి ప్రాతఃకాలర్చన, అభిషేకములు, పంచహారతులు, ధూపసేవలు నిర్వహించిన అనంతరం ఉత్తర ద్వార దర్శనాలను ప్రారంభించారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఈ సందర్భంగా టి.వి. ఫణికుమార్ శర్మ అవధాని వారి చేత వేదపారాయణం జరిగింది. సమయమంతుల అన్నపూర్ణ ఆధ్వర్యంలో శ్రీ వాసవి మహిళా గీతా సమాజం భజనలు నిర్వహించగా, ర్యాలి గ్రామానికి చెందిన కళాకారులు కోలాటం ప్రదర్శించారు. అలాగే శ్రీమతి పసుపులేటి నాగమణి గారి ఆధ్వర్యంలో శ్రీ విష్ణు లలితా మణిద్వీప పారాయణం భక్తులను ఆకట్టుకుంది.మధ్యాహ్నం అమలాపురం నుండి వచ్చిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి కోలాటం భజన మండలి కోలాటం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెల్లవారుఝామున నుంచే భక్తులు విశేషంగా విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమాలన్నీ ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో సజావుగా నిర్వహించబడ్డాయి.

## రంగు పడిందో..దొరికేసినట్టే

* రాయితీ బియ్యం అక్రమాలకు చెక్



**ఏలూరు డిసెంబర్ 30 పెన్‌పవర్** :పేద ప్రజలకు రాయితీపై ఇస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు దారి మళ్లిస్తున్నారు .ఎక్కడైనా పట్టుబడ్డా అది రేషన్ బియ్యమా..లేదా మిల్లు చెందిదా?అన్నది స్టాకు రిజిష్టర్ బట్టి తేల్చి చెప్పేవారు. ఓక్కోసారి అలా గుర్తించడం కూడా కష్టమవుతోంది.ఇకపై అలాంటి ఇబ్బంది లేకుండా బియ్యం గుట్టు పట్టేయొచ్చు.

ఇందుకోసం కూటమి ప్రభుత్వం ఎఫ్ఆర్కె ఐరన్ స్పాట్ కిట్లను పంపించింది.వీటితో పరీక్షిస్తే..రేషన్ బియ్యమా?కాదా ?అన్నది ఇట్టే పసిగట్టేయ్యవచ్చు.ఎఫ్ఆర్కె అంటే ఫోర్టిఫైడ్ రైస్‌లో ఇనుము ఉందోలేదో త్వరగా తెలుసుకోవడానికి ఉపయోగించే పరికరం.ఈ కిట్‌లోని రసాయనాలు బియ్యంపై వేసినప్పుడు అవి ఊరన్ ఆయాన్లతో చర్య జరిపి రంగు మారుస్తాయి.ఐరన్ ఉంటే ఆ బియ్యం గిజలు ఎరుపు రంగులోకి మారతాయి.ఇలా గుర్తిస్తారు..పట్టుబడిన బియ్యం నమూనా తీసుకుంటారు.తొలుత హెచ్‌సిఎల్ (హైడ్రో క్లోరిక్ యాసిడ్) ద్రావణాన్ని పూర్తిగా తడిచే వరకు పోస్తారు.వెంటనే కేఎన్‌పిఎస్ (పోటాషియంధియో సైనేట్) ద్రావణాన్ని కలుపుతారు.ఐరన్ ఉన్న గింజలు వేంటనే ఎరుపు రంగులోకి మారతాయి.

తద్వారా అవి రేషన్ బియ్యంగా గుర్తిస్తారు.

సంభందిత వ్యక్తులపై 6ఎ కేసు నమోదు చేస్తారు

## అగ్ని బాధితులకు పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ అప్పనహస్తం




**కాట్రేనికోన పెన్ పవర్ డిసెంబర్ 30:**కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని ఇటీవలే మొండి పోరా గ్రామంలో విద్యుత్ సర్క్యూట్ వల్ల తాటాకిల్లు దగ్ధమైన బాధితులకు పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సుమారు 12,000 రూపాయల నిత్యవసర వస్తువులు,వంటసామాగ్రి దుప్పట్లు,దోమతెరలు,కిరాణా సరుకులు,కూరగాయలు సర్పంచ్ గంటి వెంకట సుధాకర్,పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకటేష్, శ్రీనివాస్, శ్రీనివాస్,రాంజీ కాట్రేనికోన ఉప సర్పంచ్ కముజు మల్లికార్జునరావు,నందిక శ్రీనివాస్,రేవు వెర్రియ,వస్కా గోవింద్,గుత్తుల అబ్బు,మట్టపర్తి ఆనంద్,రేవు రాజు, రేవు అరుణ్,నెలపాటి రాంజీ,నేలపాటి రాంబాబు, బీర వరద రాజు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కరాటం పుట్టినరోజు వేడుకల్లో జగదీశ్వరి విజయ్ దంపతులు.



**గోపాలపురం/పోలవరం, పెన్ పవర్, డిసెంబర్ 20.**డిసిసిబి మాజీ అధ్యక్షులు,సీనియర్ నాయకులు, ఏజెన్సీ టైగర్ గా పిలవబడే కరాటం రాంబాబు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. జంగారెడ్డిగూడెం గ్రామ శివారులో ఉన్న కళ్యాణ మండపంలో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి విజయ్ నాయక్ లు హాజరయ్యారు. రాంబాబుతో కొద్దిసేపు ముచ్చటించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం కరాటం,శాప్ డైరెక్టర్ జగదీశ్వరినీ ఘనంగా సన్మానించారు. సమాజ సేవలో భాగస్వాములు కావాలని, గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఆ దంపతులను రాంబాబు ఆశీర్వదించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com